ఆంధ్రమహిళ

(1)

ఏకైక మహిళాభ్యుదయ మాస పత్రిక

VOL: XVII ANDHRA MAHILA

విషయసూచిక

ఆంధ్రమహిళ

వ్యవస్థాపకురాలు : దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపుటి 18 :: జనవరి, 1962 :: సంచిక 1

భాగ్యాంధ్ర మహిళ

'ఆంధ్రమహిళ'– మదరాసునగరంలో జన్మించి, మహిళాలోకం గారాబంతో దగ్గరకు చేరదీసి అల్లారుముద్దుగా పోషిస్తూండగా, ఈ 1961 సంగిరం డిసంబరునెలతో పదునేడేండ్ల యౌవనవతి అయింది. వయోవిలాసంతోపాటు ఆమెవిజ్ఞానసంపదకూడ మూడుపూలు, ఆరుకాయలుగా వెల్లివిరిసింది. తెలుగుసీమకే వెలుగుకలిగించే దివ్యజ్యోతిగా ఈనాడు 'ఆంధ్రమహిళ' తన అసమాన శోభారామణీయకతను వ్యాపింపజేస్తున్నది. తెలుగుమాగాణానికంతటికి నేడు 'మహిళ' ఏకైక (మాసపత్రికా) పుత్రిక కావటంచేత, ఆంధ్రసోదరీమణులు ఇదివరలో చూపినట్లే, ఆమెయెడల ప్రేమానురాగాలు చూపగలరని మనస్ఫూర్తిగ విశ్వసిస్తున్నాం.

ఇంతకాలం ఆంధ్రులకు అరవలకు సమిష్టిగా ముఖ్యనగరమయి వెలసిన చెన్నపురిని ఆంధ్రప్రజ వదలిపెట్టి భాగ్యనగరాన్ని తమరాజధానిగా చేసుకోవటంవల్ల, 'ఆంధ్రమహిళ'కూడ అక్కడికే తరలివెళ్లాల్నని నిశ్చయించుకొంది. అది సహజమేకదా! "తనవారులేనిచోటను, చనవించుక లేనిచోట జగడముచోటక" నిలవరాదని బద్దెన యెన్నడో సుమతిశతకంలో చెప్పాడు. కాని ఇంతకాలంగా అలవాటుపడిన చెన్ననగరంలోని తనసోదరసోదరీమణులను విడిచివెళ్లటమంటే నోటిమాటలా? అయితే, అభిమానంతో చూచి, తనబాగుకై పాటుపడే చుట్టపక్కాలు– మద్రాసులోకంటే భాగ్యనగరం (హైదరాబాదు)లో అధికసంఖ్యాకులున్నారని, వారు తన్ను చేయి విడవరని ఆంధ్రమహిళ అభిప్రాయం. ఆకారణంచేత హైదరాబాదుకు తానువెళ్లినా, సహజంగా ఆమె(ఆంధ్రమహిళ) వ్యాపకమంతా, హైదరాబాదు, మదరాసులలోనే కాకుండా, ఏ ఒక్కసోదరీమణి నివసించే తెలుగుగడ్డలోనైనా వుండగలదనే నిశ్చయంఉంది.—

'ఆంధ్రమహిళ'– తనకు ఆర్థికోపపత్తులు తగ్గిపోయినా, తన్నుపోషించేవారు కొఱవడినా, తనప్రచారానికి ఉపకరించేవారు అట్టేలేకపోయినా, తన్ను వేయికండ్లతో కనిపెట్టి, అన్నిహంగులూ కుదిర్చి పోషించే 'ఆంధ్రమహిళాసభ,' మాతమోస్వరు, దాన్ని ఇంతకాలం సాకి సంతరించింది

మనరాష్ట్రంలోనే కాకుండా, తక్కినవాటిల్లోకూడా అక్కడక్కడా సంక్షేమ కేంద్రాలు వెలసివున్నా, ప్రత్యేకంగా స్త్రీలఅభ్యుదయానికి కృషిచేసేవి కొన్నిమాత్రమే. కారణమేమిటంటే, ఆ యా రాష్ట్రాల్లోని మంత్రివర్గంలో, దీనిపై శ్రద్ధచూపే మంత్రి పురుషుడే అయివుండటమో, లేదా, స్త్రీపురుషవిచక్షణను బట్టి, వారిసంక్షేమకార్యప్రణాలికలను తయారుచేసే అధికారులు లేకపోవటమో తటస్థిస్తున్నది. ఇది చాలాశోచనీయావస్థ. అయితే, దక్షిణభారతంలోకంటే, ఉత్తరాన్నే సంక్షేమసంఘాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పాలి. మనఆంధ్రరాష్ట్రంలో ఈశాఖకు శ్రీమతి–మసూనాబేగం మంత్రిణిగా ఉండినా, ఆ యా జిల్లాలలోని సంక్షేమకార్యాధికారులు– ఈవిషయంలో తగినంత శ్రద్ధతీసుకోకపోవటం చాలా విచారకరం. ఇప్పటికయినా, రాష్ట్రప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి సాధ్యమయినంతవరకు స్త్రీలసంక్షేమ కేంద్రాలు చక్కగా పనిచేసి, అగతికలుగా ఉన్న అంగనల్ని అభ్యుదయమార్గంలో వృద్ధికివచ్చేటట్లు ఉపాయాలుకల్పించి, వారికి గృహపరిశ్రమలలో తరిబీతు ఈయటానికి ప్రయత్నం చేస్తే తప్ప ఈ సంక్షేమసంఘ కేంద్రాలవలని ప్రయోజనంవుండదు. పైగా, పోషణకు ఆర్థికోపపత్తులు ప్రభుత్వంనుండి ప్రజలనుండి లేకపోవటం వల్ల నామరూపాలు లేకుండా నశిస్తాయేమోననే భయంకూడా లేకపోలేదు.

ఈ పయివిషయాలన్నీ, పర్యాలోచించినపుడు, సంక్షేమకార్యకలాపాల్ని బలపరుస్తూ 17యేండ్లుగా ప్రచారంసాగిస్తూవున్న 'ఆంధ్రమహిళ' హైదరాబాదు– బర్కత్పుర–లో నెలకొనటమే యుక్తమని, మదరాసులోని ఆంధ్రమహిళాసభా సభ్యులు, కార్యనిర్వాహకులు తీర్మానించటం, వ్యవస్థాపకులుకూడా, దాన్ని అంగీకరించటం జరిగింది. కనుక, 'ఆంధ్రమహిళా'పోషకులు, పాఠకులు, ఇకమీదట ఆంధ్రమహిళాసభకు అనుబంధశాఖగా ఏర్పడి పనిచేస్తూన్న హైదరాబాదు నుండి కొన్ని నెలల్లో, ఈ 'ఆంధ్రమహిళా'పత్రికను అందుకోగలరు. అందుకై తాముచెల్లించాల్సిన చందాలు, విరాళాలు అక్కడి (బర్కత్పురాలోని) కార్యాలయానికే పంపగలరని నమ్ముతున్నాము.

రాష్ట్రముఖ్యామాత్యుడయిన శ్రీసంజీవయ్యగారు– మహిళాభ్యుదయకర కార్యాల్లో శ్రద్ధాసక్తులు చూపేవారని వారీమధ్యను తత్కార్యాలలోనూ, తన్నిర్మాణకృషిలోను పాల్గొని, వ్యవస్థాపకురాలును, మహిళాసంక్షేమసంఘాధ్యక్షురాలును అయిన శ్రీమతి దుర్గాబాయి దేశముఖు ఉద్యమం ఫలప్రదమయ్యేటట్లు సహకరించటం గమనింపదగింది. ఈమూడవప్రణాళికా కాలంలో, ముఖ్యమంత్రి శ్రీసంజీవయ్యగారు, సంక్షేమకార్యకలాపమంత్రిణి అయిన శ్రీమతి మసూనాబేగం గారు పూర్తిగా కేంద్రసంక్షేమ సంఘాధ్యక్షురాలికి సహకరించి, స్త్రీలుకూడా పురుషులతోబాటు సమానస్థాయి నందుకునేటట్లు చేయాల్నని అర్థిస్తున్నాం.

ఎన్నికలు : మహిళలు.

రాబోయ్యే పార్లమెంటు, అసెంబ్లీస్థానాలకు అనుమతిపొందిన మహిళాభ్యర్థులు చాల తక్కువసంఖ్యలో ఉండటం శోచనీయం. ప్రతిరాష్ట్రంలోను పురుషులతోబాటు దామాషాప్రకారం స్త్రీలకు స్థానాలు కేటాయింపబడలేదని, యింతవరకు ప్రకటింపబడ్డ జాబితాలవల్ల తెలుస్తున్నది.

ఇందువల్ల అర్హత, స్తోమతు, పలుకుబడి గల మహిళలు ఎన్నికలసంఘంవారికి కనబడలేదనికాని, వారు ఎక్కువగా ముందంజవేయడం లేదనికాని, సకాలంలో తమదరఖాస్తులను దాఖలుచేసుకోలేదనిగాని, ఆ యా పార్టీల అధిష్ఠానవర్గాలవారెవ్వరు చెప్పని కారణంచేత, స్వయంగా స్త్రీలే అభ్యర్థులు కావలెనని ఉత్సాహంతో ఎన్నికలలో పాల్గొనే విషయంలో అయిష్టత చూపటం తటస్థిస్తోంది.

రాష్ట్రశాసనసభలకుగాని, లోకసభకుగాని, యేప్రాంతంలోనైనా, ఏమహిళఅయినా ఆమె యేపక్షానికి సంబంధించిన అభ్యర్థిగానైనా నిలిచినపుడు, ఏపార్టిసభ్యుడుకూడా పోటీచేయకుండా వుండటం (కొంతకాలంవరకు) ఉత్తమమార్గం అని మాఅభిప్రాయం. ఈమాత్రం త్యాగబుద్ధితో అబలాలోకానికి ప్రోత్సాహమిచ్చేయెడల స్త్రీలకు సంబంధించిన చర్చలు వచ్చినపుడు వారు శాసనసభల్లో శ్రద్ధవహించటానికి అవకాశం ఇచ్చినవారవుతారు. అంతేకాక, యిప్పటికంటె వారికి రాజకీయచైతన్యంకూడా కలుగుతుంది. పురుషులతో సమానంగా వారికి స్థానాలు ప్రత్యేకించకపోయినా, తుదకు నాలుగవవంతు అయినా, వారికి కేటాయించటం సమంజసం. స్త్రీలకు ప్రత్యేకించిన స్థానాలకు పురుషులు అభ్యర్థులుగా నిలవరాదని ప్రభుత్వం శాసనాన్నిపుట్టిస్తే యెంతైనా మంచిది. దానికొఱకు స్త్రీలే ఆందోళన చేయాల్సని కోరుతున్నాం.

బాలవినోదం

విద్యాసాగరుడు

బాలలూ! యీఅద్భుతం వినండి. దాదాపు నూరేండ్లక్రిందట బంగాళాదేశంలో 'పండితవిద్యాసాగ'– రనే మహావిద్వాంసుడు ఉండేవాడు. ఆయన అమితజ్ఞానం గలవాడు. మహామేధావంతుడు. నిత్యసంతోషంతో, ఆడంబరాలులేని జీవితం గడిపేవాడు. బీదలు, దిక్కుమాలినవారు, అంగవైకల్యంగలవారు మొదలయిన దౌర్భాగ్యులను చూచినప్పుడు ఆయన హృదయం కరిగి పొయ్యేది. మనలో ఉండిన చెడ్డ అలవాట్లను తొలగించాల్సనే ఉబలాటంతో పెనుగులాడేవాడు.

ఆయన ఏచిన్నపనికిమాలిన వస్తువునైనా సరే, కనబడినప్పుడు విడిచేవాడుకాడు. మనం 'ఇదెందుకులే' అని అలక్ష్యంతో చెత్తదిబ్బలపాలు చేసిన వస్తువునుగూడా, ఆయన 'అవికూడా దేనికైనా, ఎప్పుడైనా ఉపయోగపడుతుందని జాగ్రత్తగా తీసికొని ఒకచిన్న పెట్టెలో భద్రపరచేవాడు. పసివాడయిన ఆయన మనమడు, తాతగారి చేష్ట చూచి పరిహసించేవాడు. ఇట్లుండగా, ఒకనాటిరాత్రి తనపెట్టె చప్పుడుకావటం విని లేచిచూచాడు. తన మమనుమడు ఆపెట్టెలోని వస్తువులను ఇటునటు తోస్తూ దేనికో గాలించటం గమనించాడు. 'ఏం చేస్తున్నావు, నాయనా?', అని తాతగారు అడగ్గా, 'నా దోమతెరను మంచానికి తగిలించే సీలముక్క పోయింది. ఇందులో అలాటిది ఏమయినా దొరుకుతుందేమో అని చూస్తున్నాను' అని ఆపిల్లవాడు జవాబుచెప్పాడు. దాన్నివిని విద్యాసాగరు నవ్వుకొంటూ లేచి ఆపెట్టెలోనుంచే ఒకసీల తీసి మనుమడికిస్తూ, 'బాబూ, చూచావా? చిల్లరమల్లర వస్తువునుకూడా అలక్ష్యంతో పారవేయకుండా జాగ్రత్తపరిస్తే అవసరమయిన సమయాల్లో ఎలా ఉపయోగపడుతుందో గమనించావా? కనుక "హుం. ఈ దరిద్రపు సీలయెందుకులే" అని పారవేయకూడదు. అదికూడా అక్కరకు ఒదుగుతుంది." అని హితబోధ చేశాడు.

జీవితంలో ఏపదార్థమయినా మానవుడికొక్కొక్కప్పుడు కావలసివస్తుందని విద్యాసాగరు భావించినట్లు మీలో ఎందఱు భావిసునాారు.

మనం-మన సంస్కృతి

శ్రీమతి ప్రభావతీ శ్రీధర్

బాబాయి పెద్దకొడుకూ, కోడలూ, (ఉరఫ్ పెద్దన్నయ్యా, వదినా) విదేశాలనుంచి తిరిగి వచ్చారని కబురు తెలిసింది. అన్నయ్య ఏదో చదువుకోసం ఓ ఆరునెలల క్రితం అమెరికా వెళ్ళాడు. నాలుగురోజుల క్రితమే తిరిగి వచ్చాడుట. చూచిరావటానికి వెళ్ళాను. గేటు తీస్తుండగానే చూచిన వదిన పరిగెత్తుకుంటూ వచ్చి నన్ను అమాంతం చుట్టేసుకుంది. ఉక్కిరి బిక్కిరయిపోయాను. ఇంతలో అన్నయ్యా అదే పోజులో పరుగెత్తుకుంటూ "రా సిస్టర్ ...." అంటూ వచ్చేస్తున్నాడుగానీ, నన్నిలా ఊపి చంపెయ్యకండి... నా ఒంట్లో అసలే బాగాలేదు! అన్నాను చిరాకుగా. అన్నయ్య నిలబడి పోయాడు- వదినా, కాస్త పక్కగా వచ్చి చెయ్యిచ్చుకుంటూ "ఫారిన్‌లో అంతా ఇలాగే రిసీవ్ చేస్తారు. ఇక్కడేమిటో ఇలా గాభరాపడి పోతారు!" అంది ఓ విధమైన హేళనతో!

నాకు ఒళ్లు మండి పోయింది. ఫారిన్‌లో అలా కావిలించుకుంటారని, మనదేశంలో కూడా తరతమ భేదం లేకుండా, అలా స్వాగతం చెప్పటమా? సరే, ఇక అడుగెట్టగానే విమర్శించటం బాగుండదని ఊరుకున్నాను. కాస్సేపు కబుర్లు అయింతర్వాత టిఫిన్ ప్రకరణం ప్రారంభమయ్యింది. టేబిల్ మీద ఉంచిన సామగ్రి చూస్తుంటే నాకు తల తిరిగినట్లయింది. స్పూన్లు, ఫోర్కులూ- కత్తులూను! "శుభ్రంగా దేవుడిచ్చిన చేతులున్నాయి. చేత్తోతింటాను" అన్నాను. "ఛ, ఛ, వ్రేళ్ళంతా డర్టీగా అయిపోతాయి, ఫోర్కూ నైఫూ వుపయోగించమ్మాయ్!" అంటూ, ఓ ఉపన్యాసం ఇచ్చాడు. అన్నయ్య. నాకు ఆశ్చర్యంవేసింది. ఆరునెలల క్రితం, శుభ్రంగా పీటమీద కూర్చుని, హాయిగా చేత్తో కలుపుకు అన్నంగానీ, టిఫిన్‌గానీ తీసుకునే అన్నయ్యా, వదినా. ఈ ఆరునెల్లో ఎంత మారిపోయారో, ఎన్ని అర్థంలేని అనుకరణలు అలవాట్లు పట్టుబడ్డాయో చూచేకొద్దీ, నాకు అసహ్యమనిపించింది. ఇలా ఇక ఎందుకు చెప్పటం? ప్రతి చిన్నపనిలోనూ విదేశీయ ఆచార వ్యవహారాలు అచ్చుగ్రుద్దినట్లు కన్పించటం మొదలెట్టాయి. ఆదంపతులలో!

ఈ రోజుల్లో మా అన్నయ్య వదినెలేగాదు, ఇలా ఆచార వ్యవహారాలలో విదేశీయులను అనుకరించాలనే ఉద్దేశంతో, ఇటు భారతీయ సంస్కృతిని విస్మరించి, అటు పూర్తిగా విదేశీయసభ్యత రాక గబ్బిలాయిల్లా తయారౌతారు. చూస్తున్నకాస్సేపు అదేదో తమాషా బొమ్మల్ని వాటిచేష్టల్ని చూస్తున్నా మనిపిస్తుందేగానీ, వాళ్ళయందు గౌరవభావం రాదు.

అదే అన్నయ్యా వదినెలని తీసుకోండి. విదేశాలలో వాళ్ళ అచారాలను బట్టి స్వాగతం చెప్పటానికి అలా మనషుల్ని కౌగలించుకుంటారుట! అదే మనదేశంలో మర్యాదగా నోటితోనే ఆహ్వానించటం పరిపాటి! లేదూ అంటే ఆడవాళ్లయితే ఆడవాళ్లను రెక్కుచ్చుకవస్తారు. అంతేగానీ జాతిభేదం లేకుండా అలా స్పృశించటం తప్పుగానే భావిస్తారు! అలాటిది ఎక్కడో నాలుగురోజులు విదేశాల్లో వున్నామని కనిపించినవారినల్లా పట్టుకుంటే, పళ్లు రాలగొట్టెయ్యరూ?

సరే, విదేశలకు వెళ్లొచ్చి మారినవాళ్లసంగతి అలా వుంచండి. ఏదేశాలకూ వెళ్లకుండానే మాస్నేహితురాలూ, ఆమెభర్తా ఆ అలవాట్లను అనుకరిస్తారు! ఉదయాన లేవగానే పళ్లుతోముకోకుండానే "బెడ్ కాఫీ" పుచ్చుకుంటారాదంపతులు! అదేమంటే, లేవగానే కాఫీపుచ్చుకోంది అడుగేనా వెయ్యలేము అంటూ సమాధానం చెబుతారు! పాచినోటితో ఈ పీడఏమిటే? అంటూ ఆ అమ్మాయి అత్తగారు పాపం 'లబ్బున' మొత్తుకుంటుంటుంది! ఎటూ బోలెడంత డబ్బున్నవాళ్లుకదా, కనీసం మంచాలదగ్గర ఓ కొళాయీ, బేసినూ, ఏర్పాటుచేసుకుని, నిద్దరలేవగానే (అదీ ఉదయం ఎనిమిదిగంటలమీదట) కాస్త నీళ్లతోనేనా నోరుపుక్కిలించుకోమని చెప్పాను!

"ప్చ్! ఏమిటీ ఈ అర్ధంలేని రూల్సు," అన్నారు ముక్తకంఠాలతో!

ఈ అలవాట్లు కొన్ని సామాన్యకుటుంబాలలో వారికిగూడా సోకింది! చిన్నపిల్లలెవరేనా ఉదయాన్నే పళ్లుతోముకోటానికి మొండికేస్తే, నయానో, భయానో, తోమించుకు తీసుకవస్తాముకదా? ఇక బాగా జ్ఞానం తెలిసినపెద్దవాళ్లే అలా పాచినోటితో ఏదో ఓఅహారం పుచ్చుకుంటూంటే, పిల్లలకుమాత్రం ఆ అలవాటు పట్టుబడదూ? విదేశాలలోవారి శీతోష్ణస్థితి వేరు! మనదేశంలో వాతావరణం వేరు! విదేశీయు

లకు వేడిగా (ముఖ్యంగా సారాయివగైరా కూడా) ఏదేనా పానీయం పుచ్చుకోనిది ఉదయాన్నే ఆచలికి, నరాలు కదలనివ్వవు. కానీ మనదేశంలో అలాటి ప్రమాదమేమీ లేదే? పాచినోటితో అలా ఏదేనా త్రాగటం, తినటం అనేది అసహ్యాకరమైనదే కాకుండా, ఆరోగ్యానికి కూడా మంచిదికాదనే సంగతి ఈ "అనుకరణీయులు" పూర్తిగా మర్చిపోతుంటారు!

ఇక కాళ్లజోళ్లు! చిన్నన్నయ్య ఊరంతా తిరిగొచ్చి, ఆ బూట్లతోనే భోజనానికి కూర్చునేవాడు! ఆ అలవాటు మాన్పించేసరికి తాతలు దిగివొచ్చారు. ఆచారాలమాట అలావుంచినా, ఆరోగ్యానికేనా అది ఎంత చెడ్డఅలవాటో చాలామందికి అర్థంకాదు. "పాదరక్షలు" అంటారు కాలి జోళ్లని! అసహ్యాకరమైన పదార్థాలూ, ముళ్లూ, వగైరా బాధగలిగించేవి, రోగకారకములైన సూక్ష్మజీవులనుంచి పాదాలను రక్షించేవి అని స్థూలంగా అర్థం! అయితే, వాటికయ్యే మట్టి వగైరా, అశుభ్రమైన పదార్థాలన్నీ, వంటఇంట్లో, మనవొంట్లో, వాటితోపాటు ఉంచుకోవాలనే అర్థం నేనెక్కడా వినలేదు! ఎక్కడెక్కడో తిరిగివచ్చి అలా ఆ కాళ్లజోళ్లతోనే భోజనానికి కూర్చుంటే, అనారోగ్యంకూడా! పోనీ, మనకేనా కాళ్లమట్టి అల్లాగే వుంటే బావుంటుందా? ఏదేనా, ఆహారం తీసుకునే ముందు కాళ్లూ, చేతులూ శుభ్రపరుచుక మరీ కూర్చోవాలంటారు పెద్దలు! ఇక విదేశాల్లోనంటారా, కాళ్లు పగిలే చలివల్ల వాళ్లు ఎప్పుడూ జోళ్లను అంటిపెట్టుక వుంటారు. మనఖర్మమేం వచ్చింది?

ఇలా వ్రాస్తూపోతే ఇలాటివి ఎన్నో వుంటాయి! కానీ ఒకసంగతిమాత్రం మనం గుర్తుంచుకోవాలి! విదేశీయ ఆచారాలను అనుకరించటంలో, మనదేశసంస్కృతినీ, అలవాట్లనూ పాడుచేసుకొని అదేదో చాలా "సభ్యత" అనుకోటం కేవలం వెర్రితనంమాత్రమే. ఒకవేళ ఏదేనా అవసరంవుండి విదేశాలకు వెళ్లినా, అక్కడ ఆ ఆచారాలకు అనుగుణంగా ప్రవర్తించినా, కనీసం మనదేశం వచ్చినతర్వాతయినా, మనం భారతీయులమనే సంగతి, గుర్తుకు తెచ్చుకోవాలి! ఇక 'బెడ్ కాఫీ' వగైరా తీసుకునేవారు కనీసం, రాత్రంతా నిద్రపోయి లేచినతర్వాత నోటిలోంచివచ్చే దుర్గంధాన్ని కాస్త పోగొట్టుకునేలోపల, పళ్లుతోముకునేలోపల, ఆహారం తీసుకోకుంటే మనదేశంలో ప్రాణం పోదు అని తెలుసుకోవాలి! జుగుప్సాకరమైన ఈ అలవాట్లు పెద్దలనుంచి పిల్లలక్కూడా వ్యాపిస్తుందని గ్రహించుకోవాలి! ఇక జోళ్లవిషయంకూడా అంతే! కాళ్లుచేతులు మురికిగా వుంచుకుని, వాటిపై ఎన్ని రకాల అందమైన బూట్లూ, మేజోళ్లూ, జోళ్లూ తొడుక్కున్నా, ఆచారానికేగాక ఆరోగ్యానిక్కూడా మంచిదికాదని గుర్తుంచుకోవాలి! ఏదెలా వున్నా, మనదేశ అలవాట్లుమార్చి, విదేశీయులను అనుకరిస్తే, మనల్ని విదేశీయులని ఎవ్వరూ అనుకోరు సరిగదా, పిచ్చివాళ్లక్రింద జమకడ్తారు. మనం చేసేపనుల్లో, ప్రవర్తన మన భారతీయసభ్యతా, సంస్కృతీ ప్రతిబింబించాలి గానీ, ఎవరినో చూచి, నక్కవాతపెట్టుకున్నట్లుగా ప్రవర్తించటం హాస్యాస్పదమని నేటి "నవనాగరీకులు" అంతా గ్రహించుకోవాలి!

బావతో బస్తీకి

శ్రీమతి లక్ష్మీనర్సమ్మ

ముస్తాబు చేసికొని, ముచ్చటగ బండెక్కి
బస్తీకి పిల్లడితో పోదామా! బావ
బస్తీలో యింతలూ సూదామా!!

బస్తీకిచేరాక, బండినుండీ దిగి
యిద్దరము జంటగా యెడదామా! బావ
యిడిపోక యింతలూ సూదామా!!

యింతలూ మాసేసి, యింటికొస్తూ మనము
యెంకటేసుడి గుడికి యెడదామా! బావ
యెంకన్నసామినీ సూదామా!!

గుళ్లోకి యెళ్లేసి, పిల్లోడినీసూపి
మొక్కించి దేవుడికి వద్దమ్మా! బావ
మొక్కులన్నీతీర్చి యేద్దామా!!

మొక్కులన్నీ తీర్చి, చక్కగాయిద్దరము
పిల్లోడితో తిరిగి వద్దామా! బావ
పిల్లడికి బొమ్మలూతెద్దామా!!

పిల్లోడు ముద్దుగా, బొమ్మలను పట్టుకొని
ఆడుకుంటే మనము సూద్దామా! బావ
ఆడుచూ పాడుచూ వుందామా!!

నేనూ - నారాజకుమారి

శ్రీ "దుర్గా శంకర్"

అది రమణీయమైన పూలవనము. ఫలపుష్పాదులతో నిండి కన్నులకింపుగా కళకళలాడుతూంది. చుట్టూ గోడతో ప్రహరికట్టివుంది. లోపల దానిమ్మలు పండ్లతోవంగి బాటసారులరమ్మని సలాములు చేస్తున్నట్లున్నాయి. మామిడిచెట్లు కాయలతో కళకళలాడుతున్నాయి. నవసరభరితమైన ఫలవృక్షముల తలలు వంచి నివాళులు చేస్తున్నట్లున్నాయి. పూలమొక్కలు బారులుదీర్చి తమసువాసనల విరజిమ్ముతూ ఆపూదోట సహజసౌందర్యము నినుమండింపచేస్తున్నాయి. మధ్యమధ్య రాతిసోఫాలు వేయబడియున్నాయి. రంగురంగులపూలు కన్నులకింపుగా తుమ్మెదల నాహ్వానిస్తున్నాయి. తుమ్మెదలు ఝుమ్మని ఝుంకారములు చేస్తున్నాయి. కోయిలలు కమ్మగా పాడుతూ ప్రేయసీప్రేమికుల కానందాన్నందిస్తామంటున్నాయి.

ఆతోటమధ్య నొకమేడ. మేడను దిలకిస్తుంటే రాజభవనములు జ్ఞప్తికి వస్తున్నాయి. పాలరాతితో కట్టబడిన భవనము కన్నులకింపుగా అందరిని ఆకర్షిస్తున్నది. ఆతోట ఒకకొండకు ప్రక్కగా దిగువభాగములో నిర్మించబడివుంది. చుట్టుప్రక్కల కనుచూపుమేరలో మనుష్యసంచారము గోచరింపదు. కొండపైనుండి తోటప్రక్కగా గలగలమంటూ ఘోషిస్తూ నదియొకటి ప్రవహిస్తూంది. నదీమతల్లి సూర్యునికిరణములను ప్రతిబింబిస్తూ స్వర్ణవాహినియా యనిపిస్తున్నది. ప్రవాహపు మోతలతో, ఫలవృక్షములతో నతిరమణీయమై విరాజిల్లు నావనమేకాంతముగా నచ్చటనుండుట నాకాశ్చర్యమును గలిగించినది. వెంటనే గుర్రమునాపి, గుర్రమును లోయలో విడిచి మెల్లగా తోటగోడ నధిష్టించి చెట్లమాటున కూర్చుండి విషయమును దిలకింప మొదలిడితిని. నేనొక రాజకుమారుడను. దేశాటనమున ఉత్సాహినై బయలుదేరి సమస్తదేశములు తిరుగుచు నీకొండసమీపమునకరుదెంచి ఈవనమును గాంచి ఆశ్చర్యచకితుడనై గోడనెక్కి విషయముల దిలకింపమొదలిడితిని. నా పేరు చెప్పడం భావ్యం కాదు లెండి.

సూర్యుడస్తగిరిని చేరాడు. రేరాజు తనవెన్నెల విరజిమ్ముతూ స్వయంవిహారం చేస్తున్నాడు. వెన్నెల తోటరమణీయతను రెట్టింపుచేసి తోటలో విహరించవలెననే కోరికను రేకెత్తించింది. వెంటనే గోడదిగి తోటలో నడువ మొదలెట్టాను. మేడదగ్గరకు వచ్చా. మేడమీద గదితలుపులు తీసినచప్పుడుతో నేను గుబురుచాటున దాక్కున్నాను.

మేడపై గదితలుపులు తెరువబడ్డాయ్. పదునారేండ్లబాలిక మెట్లమీదుగా దిగుతూంది. పోలికలు రాచబిడ్డయని చెప్పకయే చెపుతున్నాయ్. పున్నమచంద్రుని ధిక్కరించు ఆ ముఖములో విచారరేఖలు పొడచూపుతున్నాయి. ఆవిచారరేఖలు చంద్రునిలోని మచ్చను జ్ఞప్తికి తెస్తున్నాయి. చూడగా కన్యలా కనపడుతోంది. అంటే "కరుణశ్రీ" గారికి కనుపించిన కాంతమాత్రం కాదు లెండి. మెల్లగా మెట్లుదిగి తిన్నగా తోటలోకి వస్తున్నది. ఉన్నకొద్ది నాకు దగ్గరౌతున్నది. నాప్రక్కగాపోయి మల్లెచెట్టు ప్రక్కనున్న సోఫాలో చతికిలబడ్డది. నేను వెంటనే మెల్లగా ఆమె దగ్గరగావెళ్లి మల్లెచెట్టుచాటున దాక్కున్నా.

ఆమె విచారములో యేమేమో వాపోసాగింది. తనజీవితం అంధకారమయిందని, తానీదుర్మార్గుని నుండి బైటపడడమెలాగా యని, తనతండ్రి యేమౌతాడోనని తనలోతాను విచారపడసాగింది. నాలో విచారముదయించింది. ఆమెను కష్టాలనుండి రక్షించవలెననే ఆతృత నాలో బయలుదేరింది. అంతే, మెల్లగా ఆమెవెనుకగా వెళ్లి సోఫావెనుకగా నిలబడి 'ఎవరమ్మా' అని ఆప్యాయంగా అడిగా. ఆమె అదిరిపడి వెనునకు తిరిగిచూచి కెవ్వున కేకవేయబోయింది. కాని ఆమెనోటికి నాచెయ్యి అడ్డుతగలడంతో కేక వేయలేకపోయింది. అప్పుడు నేనిలా "నీవెవరు? నీవెందుకిలా విచార సాగరంలో మునిగి యున్నావు? నేను నీకు చేతనైన సహాయం చేస్తా. నన్ను అపకారిగా తలపకు. నీవిక్కడ నొంటరిగా నుండుటకు కారణమేమి? దాచకచెప్పు" మని అన్నా, ఆప్యాయిత నొలికిస్తూ. నన్నుకూడ సోఫాలో కూర్చోమని ఆహ్వానించింది. అందుకు సిద్ధంగావున్న నేను వెంటనే ఆమె ప్రక్కన ఆసీనుణ్ణయ్యా. ఆమె యిలాచెప్పడం మొదలెట్టింది "నేను గాంధార రాజకుమారిని. పేరు శోభ (పొన్నలూరివారి శోభమాత్రంకాదు లెండి) చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన అభాగ్యురాలిని. తండ్రి

గారే నన్ను అల్లారుముద్దుగా పెంచి పెద్దదాన్ని చేశారు. సేనాధిపతి మార్తాండ్ నన్ను వివాహమాడి నారాజ్యాన్నిస్వాధీనం చేసుకోవాలనుకున్నాడు. వాడొకదుర్మార్గుడు. ఆదుర్మార్గుడు ప్రజలను నానాహింసలు పెడుతున్నాడు. ప్రజాక్షేమాన్నిగుర్తించవలసినవాడు తనవిలాసాలకు అమాయిక ప్రజల పీడించి బాధిస్తున్నాడు. ఆదుర్మార్గుడిని నేను వివాహమాడటానికిష్టపడలేదు. ఏవిధంగానైనా నన్ను దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో ఒకఅర్ధరాత్రివేళ నన్ను యిక్కడకు తీసికొనివచ్చి బంధించి తన్ను వివాహమాడమని నిర్బంధించసాగాడు. ఆదుర్మార్గుడిచ్చిన గడువు ఈరాత్రితో తీరిపోతుంది. రేపుదయాన్నే నన్ను బలవంతంగా వివాహమాడి, లేదా,నాతండ్రితోసహా నన్ను అంతమొందించి తనఅధికారాన్ని చలాయిస్తానని నాతో చెప్పాడు. మీరెవరో పోలికలు చూడగా రాకుమారునివలె కనుపిస్తున్నారు. అర్తరక్షుడైన భగవంతుడే యీరూపంలో వచ్చాడని తలుస్తాను. నన్ను నాతండ్రిని, నారాజ్యాన్ని కాపాడమని కోరుకుంటున్నా." నేను ఆనందంతో తన్మయుడినైపోయి." నేనూ రాకుమారుడనే, శ్రావ్యరాజ్య యువరాజును! దేశాటనం చేయవలెననే కోరికతో బయలుదేరి తిరుగుతున్న నన్ను ఈతోట ఆకర్షించింది, దానితో నీపరిచయం లభించింది. నిన్ను రక్షించడానికి ప్రాణాన్ని బలియివ్వడానికైనా వెనుదీయను. నీఅందం, సౌకుమార్యం. లావణ్యం నన్ను తొలిచూపులోనే ఆకర్షించాయి. నేనూ అవివాహితుడనే. అభ్యంతరం లేకపోతే..." అంటూ దగ్గరిగా జరిగా. ఆమెలో సంతోషం పొంగింది. సిగ్గు రేకెత్తింది. హృదయంలోని బాధను మరచి హాయిగా నాహృదయంపై వాలిందాయబల. నావళ్ళు గగుర్పొడిచింది. గాంధారరాజపుత్రి సుకుమారి. లావణ్య నన్నువరించి నాఅర్ధాంగి కావడం నాఅదృష్టమని మురిసిపోయా. భయము వీడమని నాచేతితో శోభతల నిమురుతు తన్మయుడనయ్యా. అంతే ఎంతసేపు గడిచిందో నాకే తెలియదు. అంతలోనే గుర్రపుడెక్కల చప్పుడు వినిపించింది. వెంటనే శోభ ఉలిక్కిపడి లేచి బహుశా వచ్చేది మార్తాండే అయియుంటాడని చెప్పింది. శోభను తనభవనంలోకి వెళ్లమని చెప్పా. కాని నన్ను వదలి వెళ్లలేనని భయంతో నన్ను చుట్టవేసింది. సరే. భయములేదని అక్కడే కూర్చునాం. నాహృదయంపై తన తలను వాల్చి కళ్లుమూసుకుంది శోభ. పాపం మార్తాండ్‌కు భయపడి. నేనామెను ఓదారుస్తూ అక్కడనే ఉండిపోయా,

మార్తాండ్ రానేవచ్చాడు. భవనంలో అడుగుపెట్టాడు, రౌద్రాకారంతో. శోభ కనుపించలేదు. వెంటనే గర్జించాడు, కోపంతో, శోభకోసం వెతుకుతున్నాడు భవనంలో. తన్నుతప్పించుకొని పారిపోలేవని, ఆమెతండ్రిని మరునాడు బంధించపోతున్నారని, ఆమెను కాపాడేవాడెవ్వడూ లేడనిగర్జిస్తూ తోటలోకి అడుగుపెట్టాడు. కొంతసేపటికి మేము కంటబడ్డాం. నన్నుచూచి చకితుడై గర్జించాడు. వెంటనే "మార్తాండ్ ! ఏంగాడిదలా ఓండ్రిస్తున్నావు. నీదారికి అడ్డు తగిలాననా బాధపడుతున్నావ్. నీఅత్యాచారాలింక సాగడానికి వీలులేదు. న్యాయంకోసం, ధర్మంకోసం, నాప్రాణాలైనా త్యాగంచెయ్యడానికి సిద్ధంగా వున్నా, గాంధారరాజ్యలక్ష్మిని కాపాడడం నాధర్మం. శోభ నన్ను శరణువేడింది. రక్షించకవదలను. నీఆటలు సాగవని మార్తాండ్‌ను హెచ్చరించాను. మార్తాండ్ రౌద్రాకారంతో పండ్లు పటపటకొరకుతూ కత్తిదూసి నాపైకురికాడు. నేను కూడ కత్తిదూసి యుద్ధానికి తలపడ్డా, శోభ నేనేమౌతానో, తనభాగ్యరేఖ ఎలా వున్నదోనని భయంతో వణికిపోతూ భవనంలోకి వెళ్ళి మెట్లపై ఆవేదనతో చూస్తూ నిలబడ్డది. మార్తాండ్ నన్ను దెబ్బకొట్టబోయాడు, నేను తప్పించుకొని కొట్టిన దెబ్బతో యెదురుగానున్న సోఫాలోపడ్డాడు. అంతలోనే వెళ్లి మార్తాండ్‌పై బడ్డాను. మార్తాండ్ నన్ను తన్నిన తన్నుతో వెళ్లి మల్లెపొదపై పడ్డాను, మల్లెపొదంతటితో నేలమట్టమయింది. ఇద్దరం చెలరేగి యెత్తుకుపైయెత్తులతో హోరాహోరిగా యుద్ధంచేస్తున్నాం. వెన్నెలలో కత్తులు మెరిశాయి. కేకలు పెరిగాయి. కొద్దిసేపటిలోనే నందనవనంలా కళకళలాడుతున్న పూదోట శ్మశానంలా తయారయింది. పండ్లురాలి పచ్చడిలా తయారయ్యాయి. పూలు మాకాళ్లక్రింద నలిగిపోయాయి. ఒకరికొకరు తగ్గక తలపడుతూ తోటదాటి కొండనధిరోహించడం మొదలుపెట్టాం. రాళ్లు జారుతున్నాయి. మేము దొర్లుతున్నాం. మళ్లా తలపడుతున్నాం. కొండశిఖరాన్ని చేరుకున్నాం. కత్తులు ఖంగ్ మన్నాయ్. అరుపులకు కొండ ప్రతిధ్వనిస్తూంది. మార్తాండ్ దెబ్బకొట్టాడు. దానికి నాకత్తి నడ్డువేసి ఊపునాపుకోలేక క్రిందపడ్డా, లేచేలోపల మార్తాండ్ కత్తితో ఊపుగా పొడవబోయాడు. అతికష్టంమీద

వెంటనే ప్రక్కకు తప్పుకొన్నా. ఊపు నాపుకోలేక కొండకొనపైబడి జారాడు. తలపగిలింది. అంతే, మరల మార్తాండ్ నదిలో పడ్డచోటున మాత్రం నీళ్లకదలిక కనుపించింది. మార్తాండ్‌ను నదీమతల్లి తనగర్భంలో దాచుకున్నది. నాకు వళ్లంతా నొప్పులుపుట్టాయి. అక్కడక్కడా రక్తముమరకలు కనిపిస్తున్నాయి. మెల్లగా కొండదిగి భవనంలోకి వచ్చా. శోభ నన్ను ఆప్యాయంగా ఆదరించింది. ఆనందంలో కౌగలించుకొన్నది. శోభ నన్ను శయ్యపై పరుండబెట్టి ఉపచర్యలు చేయసాగింది,

తెల్లవారింది. శోభ నాకు ధన్యవాదాలలో పాటు తనహృదయాన్నే సమర్పించింది. సమర్పించిన హృదయాన్ని ఆనందంతో స్వీకరించా. శోభ నాభార్య అయినందుకు నాఅదృష్టానికి మురిసిపోయా. గాంధార రాజ్యానికి ప్రయాణమయ్యాం, నా గుర్రం కోసం లోయలో వెదికా, ఎక్కడాకనుపించలా, సేనాని గుర్రం వాకిట్లో కట్టివేసియుంది. చివరకు యిద్దరం సేనానిగుర్రంమీద బయలుదేరాం, దారి ఒకకాలిబాట. బాటకిరుప్రక్కల పచ్చగడ్డి దట్టంగా కన్నులకింపు చేస్తున్నది. ఆపచ్చికబయలులో కొంచెంసేపు విశ్రాంతి తీసికుందా మనిపించిది. గుర్రానికికూడ సేనాని బుద్ధులు వంటబట్టాయేమో పరుగెత్తుతున్నగుర్రం ఒక్కసారిమమ్ములను క్రిందికి విసిరింది. ఊహాలోకంలో వున్న మేము క్రిందపడిపోయాం, దెబ్బలుమాత్రం తగలలేదులెండి, పచ్చిగడ్డిలో.

కళ్లుతెరచి చూచేసరికి గుర్రంలేదు,శోభాలేదు. తెల్లవారింది. నేనుమాత్రం మంచముమీదనుండి క్రింద వెల్లకిలాపడియున్నాను. నేనింకా అదృష్టవంతుణ్ని, ఎవరూ చూడలా. నాలో నేను నవ్వుకుంటూలేచా. అంతే. ఆసంగతి మరెవ్వరికీ చెప్పదలుచుకోలా, మీకుతప్ప, చెప్పడానికి నాకే సిగ్గుగావుంది. గప్‌చుప్, మరెవ్వరితో చెప్పకండేం !

భారతీయ సమాజమును చిత్రించు వ్యాఖ్యానమాల

శ్రీ దే. శం. లక్ష్మకే, ఎం. ఎస్. సి. బిటి.,

వ్యాఖ్యాత్రి శ్రీమతి కే. ప్రభా, ఎం. ఏ., డి. పి. ఎడ్.

(వి. వత్సల అనువాదం)

ఆంధ్రదేశమును మూడుభాగములుగా విభజింపవచ్చును. అవి 1. ఉత్తరసర్కారులు. 2. తెలంగాణము. 3. రాయలసీమ. కాని బౌద్ధవాఙ్మయమున, "మంజిల్", నాగదేశము, మఱియు సాగరసీమ యను శబ్దములచే నుచ్చరింపబడుచున్నది.

ఆంధ్రసరిహద్దులలో పావనమగు గోదావరి, కృష్ణా, వసిష్ఠ, తుంగభద్ర, గౌతమి, పినాకిని, ఋషికుల్య మొదలగునదులు ప్రవహించుచున్నవి.

ఇక సింహాచలము, భద్రాచలము, తిరుమల, శ్రీశైలము, మొదలగు ప్రసిద్ధపర్వతములు గలవు. భారతదేశమునందు మిక్కిలి ప్రసిద్ధిచెందిన దేవస్థానము తిరుపతి. ధార్మికమహాత్మ్యమును వెల్లడించు ఒకగొప్ప యాత్రాస్థలముగను, అఖిలభారతీయుల దృష్టియందు ఒకగొప్పపుణ్యక్షేత్రముగను వెలసియున్నది. ఏడు కొండలను దాటినచో, శ్రీవేంకటేశ్వరులను దర్శించు భాగ్యము మనకు గలుగును. ఆంధ్రదేశమునందు మిక్కిలి శ్రీమంతమైన దేవాలయమిదియే. దానధర్మములు చేయుటకు, ప్రార్థనలు చెల్లించుటకు అనుకూలముగ నిర్ణయింపబడిన స్థలమిదియే. శ్రీవేంకటేశ్వర విద్యాపీఠాధిపతులు ఈదేవాలయ ఐశ్వర్యమును వైద్యశాలలకును, విద్యాలయములకును మహోన్నతపాఠశాలలకును వినియోగించుచున్నారు.

శ్రీశైలము పండ్రెండు జ్యోతిర్లింగములచే ప్రకాశించుచున్నది. దీనిని శాతవాహనులు 250 సంవత్సరములు తమకు వశపఱచుకొనియుండిరి. చాళుక్య రెడ్డిరాజులును ఏలిరి. వెనుక శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యమును స్థాపించి వ్యాపింపజేసెను.

ఉత్తరమునందు మహారాష్ట్రమును, దక్షిణమున ద్రవిడసంస్కృతుల మిశ్రమముచే "తెలుగు"ను సామాజిక భాషలుగా వ్యవహరింపబడినవి. 'తేనెలగు' అను నది తెనుగయ్యెను. క్రమముగ తెలుగయ్యెను. దీనినే "Italian of the east" అనెదరు. ఈలిపికి శిరోరేఖలు లేవు. గుండ్రముగ నుండును. మొట్టమొదట కవిత్రయమగు నన్నయభట్టు, తిక్కన, ఎఱ్ఱాప్రగడలచే మహాభారతగ్రంథము రచింపబడెను. ఈగ్రంథము కేవలము వ్యాసమహర్షుల గ్రంథమునకు అనువాదము కాదు. తెలుగుభాషామధురామృతము స్రవించు ఒక అమూల్యమైన నిధిగ బరిగణింపదగును. ఈభాషలో ఉకారములు ఎక్కువ. మృదువులగు వ్యంజనములధికములు. ద్వంద్వార్థములు, శ్లేషలు– గల కావ్యపంక్తులనేకములు.

ఉదా :– "రాఘవపాండవీయము", రాఘవఅను పదముచే రఘువంశముయొక్కయు పాండవ అను పదముచే పాండవులవంశముయొక్కయు చరిత్రమును చిత్రించుకావ్యము. ఆంధ్రభాషలో అనేక సంస్కృత పదములు వాడబడుచున్నవి.

ఉదా :– స్నానము, నిద్ర, భోజనము మొదలగునవి.

మొట్టమొదట 'రామలీల' అను నాటకమును 1880 సం॥ మధ్య 'ధార్‌వార్ నాటక మండలివారు' మహారాష్ట్రీయుల ఆంధ్రమంతయు నాటకముగ ప్రదర్శించిరి.

ఆంధ్రసమాజము చాతుర్వర్ణ్య సముపేతము. బ్రాహ్మణులు, శూద్రులను తీవ్రభేదము నాటినుండియే గలిగియున్నారు. శూద్రులలో రెడ్డివర్గము అధిక శ్రీమంతమైనది.

భారతసంస్కృతి పండుగలకు ప్రాముఖ్యము నిచ్చుచున్నది. సంక్రాంతి ఎక్కువప్రాధాన్యము గలది. మఱియు, దసరా, నాగపంచమి, నరకచతుర్థి ఇట్టివి విశేషమైన పండుగలు. ఈరోజులలో, రకరకములగు ముగ్గులు వేయుటయు, దీపములు వెలిగించుటయు, భారతీయులకొక నూతనోత్సాహము గలిగించును. రంగోలివేయుటకూడ ఒకకళయే. దీని సౌందర్యము వర్ణనాతీతము.

ఉత్తరభారతమందలిగుళ్లు చాలపెద్దవి. ప్రాకారములు మూర్తులు కూడ చాలపెద్దవి. భగవంతుడు శ్రీమంతమైన ఐశ్వర్యాలంకారములచే భూషితుడగును

పది, పదునైదు రోజులు బ్రహ్మోత్సవము జరుగును. బీదసాదలు, భక్తులు, క్షేత్రములను దర్శించుజనులు వేనవేలు. కార్తికపౌర్ణమి ఒకగొప్ప విశేషదినము. దేవతాభవనములన్నియు అసంఖ్యాక దీపములతో శోభితమై అతిరమ్యముగ నుండును. భగవంతుడు జలప్రదక్షిణము (తెప్పఉత్సవము) చేయు దృశ్యము దీపకాంతులతో కనులపండువుగ నుండును.

ఇచ్చట వివాహవిధులు వివాహితదంపతుల సాక్ష్యమున జరుగును. ఆరంభమునుండి వైదిక పద్ధతులలో జరుగును. తలంబ్రాలు పోసుకొనుటయు, తరువాత మంగళసూత్రధారణమును, ఒకపవిత్రమైన విధి యని భారతీయుల విశ్వాసము. బ్రాహ్మణులలో వధూవక్షమువారే సకలవిధములైన ఖర్చులను భరింపవలయును (పూనా మాసిక సమాచారము: అక్టోబరు.)

రాణి దుర్గావతి

శ్రీ బూదూరు రామానుజులురెడ్డి

[రాజస్థానమందలి గోండ్ రాజ్యాధిపతి దళపతి శాహి మరణానంతరం ఆయన వీరపత్ని దుర్గావతి సర్వస్వతంత్రముగ, ప్రజానురంజకముగ రాజ్యపాలనము సాగించుచుండెను. రాజ్య విస్తరణకాంక్షతో రాజపుత్ర రాజ్యములన్నిటిని ఒక్కొక్కటిగ కబళించుచుండిన ఢిల్లీచక్రవర్తి అక్బరుపాదుషా "మా యేలుబడికి లోబడి కప్పముకట్టు. లేకున్న రక్తపాతముతప్పదు" అని దుర్గావతికి చెప్పిపంపిన సందేశానికి ప్రతిసందేశమొసగి, స్వాతంత్ర్యమును ప్రకటించిన గోండురాజ్యముమీదికి, అక్బరు తన సరదారు అసఫ్ ఖాను నాయకత్వాన దండెత్తించి పంపినప్పుడు రాణి దుర్గావతి తన యోధవారమున కొసగిన ఉద్బోధ ఇది]

సంధికై మొన్న యిటువచ్చి చనినమాత
క్రూరుఁడౌ పాదుషాకేవొ గ్రుచ్చిచెప్పి
దండయాత్రను సాగించి తరలివచ్చె
నౌర! సత్యంబు ధర్మంబు నడపిఁజేరె.

న్యాయవిరహితు, సబలు 'నచ్చా' యటంద్రు
దోసమెఱుఁగని దుర్బలు ఛూ యటంద్రు
పరమసాధుల గోవులఁబట్టి చంపు
కటికవారల కెందేని కరుణయున్నె.

స్వేచ్ఛనాఁబడు సంగ్రామ సీమయందు
విజయులగుటకు ధైర్యంబు, వీరపటిమ
సత్యసంధత యాత్మవిశ్వాసములను
నాయుధంబుల విడువకుఁ డార్యులార!

అరికిలోబడి యాను పాయసము కంటె
సేచ్ఛమె త్రాగుగంజియే ప్రీతిఁ గూర్చు
బానిసపు జీవనంబు తప్పనియదనున
శలభముంబలె నాత్మనాశనము మేలు.

తాత తరములనుండి స్వాతంత్ర్యరథము
సాగుచున్నది మనసీమ జానుమీఱ
కట్టి! నేటికి మొగలుల గడబిడలకు
నదరిబెదరిన నవ్వరే యఖిలజనులు.

మన స్వతంత్రత హైందవ మతవిభవము
బద్ధకంకణులగుచు సముద్ధరింప
వలయుఁ, గాదేని యసువుల వదలవలయు
బొందిలోఁగ్రాఁగు నొకరక్తబిందువున్న.

దైవయోగంబు కర్మసంధాన మనెడి
పిచ్చివేదాంతములఁ బ్రొద్దుపుచ్చరాదు
పగఱమార్కొనమియు రాచపాడిగాదు
రణముకంటెను కార్యాంతరంబులేదు.

పుట్టువారంద ఱెన్నాళ్లు పుడమినున్న
చచ్చుటె తిరంబుగాన సుక్షత్రియుండు
మానధనుఁ డేదొ రుగ్మత మడియుకంటె
కత్తిపోటుల నీల్గుటే ఖ్యాతిగాదె?

హైందవోన్నతిఁ జాటుఁడో యనఘులార!
మన స్వతంత్రత నిల్పుఁడో మాన్యులార!
తల్లిఋణమును దీర్పుఁడో తనయులార!
అర్యమ సమానులార! యోయన్నలార!

బెండుదేలక యోచన యొండులేక
యట్టె నడుములు బిగించి తయారుగండు
వేడ్కనిండార మదిని వేవేగలెండు
పోరునకు పొండు విజయంబు పొందిరండు.

అప్పగింత!

శ్రీ 'అశ్వని' కవుల ఆంజనేయశర్మ, అనకాపల్లి.

[కొత్తగా పెళ్లయినకుమార్తెను అత్తవారింటికి పంపడానికి చక్కగా అలంకరించారు తల్లిదండ్రులు. ప్రయాణానికి వియ్యపురాలు, వియ్యంకుడు, అల్లుడు-అందరు సిద్ధమయ్యారు. అల్లారుముద్దుగా పెరిగిన కూతురు ఇల్లువదలిపోతుంటే ఆవేదన కలిగిందాతల్లి దండ్రుల హృదయాల్లో. కంట తడిపెడుతూ కూతుర్ని దగ్గరకు తీసుకొని, తలనిమురుతూ తండ్రిపలికిన పలుకులివి...]

చిన్నారిపొన్నారి
చిట్టినాతల్లీ!
పెంచి నిన్నూ మేము
పెద్దచేశాము!
చదువు బాగా నీకు
చెప్పించినాము!
అయ్యచేతికి నిన్ను
అప్పగించాము!
భర్తయెడలను నీవు
భక్తితో నుండు!
అత్తగారిమాట
అనుసరించమ్మా!
మామగారిని చూడు
మర్యాదగాను!
బావగారికి నీవు
బదులు చెప్పకుమా!
తోడికోడలి చూడు
సాటి నీఅక్కవలె!
ఆడబడుచులతోడ
కీచులాడకుమా!
మరుదులను చూడమ్మ
ముద్దుగా ఎపుడు!
భర్త మాటను నీవు
పాటించవలెను!
అత్తమామలకు
కొత్తకోడలవు!
పుట్టింట యున్నటులె
అత్తింటఉండు!
కోపమ్ము నీభర్త
[illegible]

శాంతమున మెలగుమా
చిన్నారితల్లి!
ఇంటిగౌరవమును
ఇలలోననిల్పి!
పెద్దలను పూజించి
పేరొంది నీవు!
ధన్యురాలను కీర్తి
ధరణిలో పొందు!!

[అల్లునికి కూతురుని అప్పగిస్తూ....]

చిన్నారితల్లి నీ
చేతులారంగా!
అల్లుడా నీకిదిగో
అప్పగించితిమి!
కన్నవారిని విడిచి
ఎన్నడూలేదు!
అత్తవారిల్లంటె
కొత్తగానుండు!
బావమరుదులు అంటె
భయముగా నుండు!
పనులు చేయుటలోను
అనుభవము లేదు!
సిగ్గుచే నాతల్లి
చనువుగా నీతో!
మసలకపోతేను
కసరబోకోయి!
మెందటిరాకనినీవు
మన్నించవోయి!
చిన్నతనముచే పనులు
చేయలేకుంటె!
తప్పుగా భావించి
దండింపబోకు!
అన్యోన్యముగ ఉంటు
ఆనందమొంది!
సంసారనౌకను
చక్కగా నడిపి!
తల్లిదండ్రులకూ
అత్తమామలకు
ధరణిలో ఘనకీర్తి

కోడరికం

శ్రీ నందివాడ కామేశ్వరరావు, విజయనగరం.

"చాల్లే! నోరుముయ్యి. ఆఫీసునుండి వచ్చేటప్పటికి రోజూ యేదో ఒకగోల! అబ్బబ్బా! మీఅరపులు పడలేకుండా వున్నాను. ఇంటికన్నా గుడే పదిలమన్నట్లు, ఆఫీసులో వుంటేనే హాయిగా వున్నట్లుంది. ఆఫీసులో అయినా యెంతకని వుంటాం. వున్నకొద్దీ ఆఫీస్తు మేష్టరు అంబాజీపేట ఆముదంలాగ తగులుకుంటే మరి వదలనట్లు యేదో ఒక పని తగిలిస్తునే వుంటాడు. ఛీ! సత్రవుకంటే కనాకష్టంగా వుంటె మరేంకొంప" అన్నాడు కోటువిప్పుకుంటూ రమణయ్య.

ఆ! యిక వచ్చేడురా! యింటికి పెద్ద. పెళ్లాని వెనక్కువేసుకు రావడానికి. 'పెళ్లాం బెల్లముక్క అప్పచెల్లెళ్ళు అప్పడంముక్క' అని మూతి విసురుకుంటూ కొళాయికిపోయింది యిల్లుపట్టిన అప్పచెల్లెలు శేషమ్మ.

నోరుముయ్యే శేషు! ఇంటికి పెద్దవాళ్ళయిన అన్న ఒదినె అంటే మీకు గౌరవం యెక్కడవుంది! మీ అత్తగారు నిన్ను అనేకవిధాలుగా బాధలు పెట్టిందని నువ్వు మీవదినెగారిని బాధలు పెట్టతలంచుకోవడం అధర్మంకదా! ఒకయింటికి ఆడపిల్ల దేనికోసం వస్తుంది! తిండికిబట్టకేలేక! సంసారధర్మం నిర్వర్తించుకోవడానికేకదు, ఆడమొగపెళ్ళిళ్ళు చేసుకుంటారు. యింతకీ నాపెళ్ళాం గయ్యాళి అయితే, నేనుమాత్రం యెందుకు వూరుకుంటాను. మీఅందరికన్న అది ఎక్కువ అనుకున్నారా! రోజు నాకు యిదోపాట అయిపోయింది అన్నాడు చల్లారిపోయిన కాఫీనీళ్ళు త్రాగుతూ.

వూరుకోరా! నీకుతెలియదు, నీపెళ్ళాం యేం తక్కువయిందికాదు. దానిసంగతి నీకుతెలుసు?
అవునమ్మా! అందరిసంగతులు నీకు బాగతెలుసును. తెలియబట్టే పిల్లలందరికి యీవిధంగా తరిఫీతు యిచ్చేవు. ఒకయింటిపిల్ల మనయింటికి వచ్చిందంటే సుఖపెట్టడం మానేసి బాధలుపెట్టడమే మర్యాద కాబోలు? మళ్ళీ! తల్లీ కూతుళ్ళు కోవెల్లో పురాణాకిల హరికథలకి ముందు వెళ్ళి కూర్చుంటారు. పురాణాల్లో చెప్తూవున్న నీతులు యిదేనా! లక్ష్మణుడు అన్నఒదినె అంటే భక్తివిశ్వాసాలు వుండబట్టే కదూ అరణ్యాలకి వెళ్ళేడు. నిండుసభలో ద్రౌపదిని మానభంగం చేస్తూవున్నప్పుడు భీముడు, అర్జునుడు అన్నగారి మాటప్రకారం వూరుకోలేదా! చెప్పవలసివస్తే మనపురాణాల్లో యెన్నో నీతులున్నాయి.

అవునురా. నీపెళ్ళాం ద్రౌపది, సీతలాంటిది కాదు. అన్నది ప్రక్కగదిలోంచి సత్యం చదువుతూ వున్న ఆంధ్రప్రభ టప్పునమూసేసి.

చాల్లేరా! నీవుపన్యాసం నీపెళ్ళాం పైకి కనబడకుండా కాల్చేస్తుంది. నారినుచ్చులాగ, అంటూ కొళాయినుంచి బిందె చంకనుబెట్టుకొని చక్కావంటింట్లోకి పోయింది శేషమ్మ. యిదుగో అత్తగారూ యీరాద్ధాంతం అంతా యెందుకు? నేను ఒక్కమాట చెప్తున్నాను వినండి అంది కోడలు కనకమ్మ.

మీరు అత్తగారని తక్కినవాళ్ళు ఆడబిడ్డలని యేదో విధంగా ఆడిపొయ్యడమే. మీఅందరి అధికారం అని అభిప్రాయపడుతున్నారు కాబోలు; మీఅబ్బాయిగారిని వెయ్యిరూపాయిలు కట్నంయిచ్చి నేనుకొనుకున్నాను. మీకొడుకుమీద మీకేంహక్కువుందో నాకు అంతహక్కు వుంది యిలాంటిజట్టీలు తగులూపెడితే మీఅబ్బాయిగారిని తీసుకొని నేను రేపు వేరింటికాపురం పెట్టుకుంటాను. ఆ! ఆ! అబ్బో! వేరింటికాపురమే! మాఅందరినోట్లోను మన్నుకొట్టేస్తా! అంతపని మాత్రం చెయ్యకుతల్లి! యీరోజుల్లో కోడళ్ళు అందరూ యింతే. గట్టిగా మాట్లాడితే మొగుడ్నితీసుకొని వేరే పోతామంటారు. అంటూ తిన్నగా నట్టింట్లోకి పోయింది అత్తగారు.

ఆహా! యెంతకాలానికి అత్తగారికి జవాబుయిచ్చేవు కనకమ్మా అంటూ కౌగిట్లోకి తీసుకున్నాడు రమణయ్యపంతులు

ఉపయోగవ్యాపకములు - తలనూనె తయారీ

శ్రీమతి గా. సుబ్బాయమ్మ

మానవుని అవయవాల్లో మిక్కిలి ప్రధానమైనది మెదడు. మెదడు ఆరోగ్యముగను చురుకుగను ఉన్నప్పుడే మానవుడు పూర్తి ఆరోగ్యవంతుడు కాగలడు, అది సరిగాలేనప్పుడు సర్వారోగ్యము పూర్తిగా చెడి, అనేక కష్టములకు లోనగుట సహజము. అట్టి పూర్తి ఆరోగ్యము గల మేధస్సుగలవారే విఖ్యాతి చెందిన చిత్రకారులు, శిల్పులు, గాయకులు, రాజకీయ వేత్తలు - కవులు - యుద్ధవీరులు, అకుంఠితమైన ప్రతిష్ఠ నార్జించగలిగారు. గనుక అట్టి అతిసున్నితమైన ఈ మెదడును, సరియైన పద్ధతిలో కాపాడుకొనుట ప్రథమకర్తవ్యం.

అది అంత సున్నితమైనదగుటచేతనే భగవంతుడు కూడా, దానిని బలమైన యెముకలగూటిలో అమర్చి దానిపైన పల్చని మాంసముతో గూడిన చర్మమును దట్టమైన శిరోజములు కలిగి పోషింపబడునట్లు సృష్టించాడు. యిన్ని కాపుదలలు కలిగిఉన్నను, అనేకరకములైన వ్యాధులు, మార్పులు ఈజుట్టుకు, దానికి సంబంధించిన చర్మమునకు కలుగుతూనే ఉంటాయి. ఎక్కువగా ఆలోచనశక్తిని ఉపయోగించేవారికి తీవ్రమైన ఆలోచనలవల్ల, మెదడు వేడిచెందుట సహజం. దాన్ని తగ్గించి సమత్వమును తేవలసిన సాధనోపాయములు అవసరం. అది మెదటికి కాపుదలగా ఉండే శిరోజములద్వారా జరుపవలసి ఉంటుంది. అవి స్నానం చేయుట, చల్లదనము నిచ్చు తైలములను ఉపయోగించుట మొదలగువానివల్ల జరుగును. యింతేగాక అపరిశుభ్రతవల్ల, అజాగ్రత్తవల్ల ఈ శిరోజములు, కుప్పించి తెలకూడా ఇతరములైన వ్యాధులు సంక్రమింపచేయును. యిట్టివి చుండ్రు, పేలు పట్టుట, శిరోజములు వూడిపోవుట, చిన్నవయస్సులోనే, నెరసిపోవుట మొదలైనవి.

ఈ వ్యాధులు, నివృత్తి చేయుటకు, కొన్ని ఔషధులు: మూలికలతో కలసిన తైలములు, వాడవలసిఉన్నది.

తలకు రాసుకునే నూనెలు అనేకరకాలు వున్నాయి. అవి, ఎవరికి ఏరకము అవసరముందో ఆ అవసరాన్నిబట్టి ఆ యా నూనెలు మనం సొంతంగా కొంచెము శ్రద్ధ పట్టి యిండ్లల్లో తయారుచేసుకుంటే డబ్బుఖర్చు తక్కువగా వుంటుంది. మనకు అవసరమైనటువంటి నూనె తయారు చేసుకున్నవాళ్లము అవుతాము.

సామాన్యంగా తలకువుండే అనేకరకాల వ్యాధులకు భృంగామలకతైలము పనికివస్తుంది. ఏవ్యాధి లేకపోయినా మెదడునకు, కండ్లకు చల్లదనం చేసి శిరోజములను బాగా ఎదగటానికి, నల్లగా వుండడానికి మందార నూనె పనికివస్తుంది. బాల్యములోనే తల నెరసిపోయిన పడుచువాండ్రకు, ఆ నెరపు పోగొట్టి నల్లగా తుమ్మెద రెక్కల్లాగు శిరోజములను తయారుచేసే నూనెలు వున్నాయి.

భృంగామలక తైలము తయారుచేసే విధానము- చెప్పుచున్నాను:

మొదట ఒక చిన్న బిందెడు నీళ్లు పట్టే ఒక కొత్తకుండ నీళ్లుపీల్చకుండా వుండేటట్లు తయారుచేసుకోవాలి. అందుకు ఆకుండలో 4 రోజులు నీళ్లుపోసి వుంచి తరువాత కొంచెము నీళ్లు పోసి కాచి కుండను తయారు చేసుకోవాలి. గుంటకలగర ఆకులరసము, పెద్దవుసిరికకాయల రసము తీసి జాగ్రత్తపెట్టుకోవాలి. ఈరసములుతీయడం, వీటిని వేరువేరుగా రోట్లో వేసి దంపి గుడ్డలో వడపోస్తే రసము వస్తుంది. రసమును సమానకొలతలుగా ఒక గ్లాసుతో కొలుచుకుని ఉంచాలి- ఒక్కొక్క రసము రెండేసి గ్లాసులచొప్పున ఒక వీశ మంచినువ్వులనూనెను పోయాలి. 2½ గ్లాసుల ఆవుపాలుకూడా పోయాలి. వీటినన్నింటిని కలిపి ఆకుండలో పోసి పొయ్యిమీద సన్నని సెగతో యిగరబెట్టాలి. అవి పూర్తిగా యిగిరాక విష్ణుమధుకము- మంచిగంధపుపొడి- రక్తచందనము- కటుకరోహిణి- దుంపరాష్ట్రము- వట్టివేళ్లు కురువేరు- తుంగముస్తెలు, ఈదినుసులు బాగా ఎండబెట్టి దంచి చూర్ణము చేసుకోవాలి. ఒక్కొక్క మూలిక అరతులం చొప్పున వుండేలా తయారుచేసుకుని. ఈ కాగిననూనెలో ఈ చూర్ణము వేసి, ఒకపొంగు వచ్చాక క్రిందకు దింపి, చల్లారినతరువాత గుడ్డలో వడబోసి సీసాలోగాని జాడీలోగాని జాగ్రత్తపెట్టుకోవాలి. ఇది వాడే విధానము-

స్నానము చేసేముందు నాలుగుచుక్కలనూనె ముక్కులో వేసుకుని పీల్చి కొంతనూనె తలకు మర్దనచేసుకుని పెసరపిండితోగాని, సీకాయతోగాని శిరోజములు శుద్ధి స్నానము చేయవలెను.

శిరోవాతములు, కండ్లజబ్బులు, పైత్యపుతిరుగుడు, తలపోటు మొదలైనవి తగ్గును. మెదటికి సంబంధించిన వ్యాధులను పోగొట్టును. మెదడునకు చురుకుతనము కలిగించును-

మందార నూనె

ఈమందార నూనెకూడా తయారు చేసుకోవచ్చు. ఈ నూనె మెదడుకు, కండ్లకు చలువ చేస్తూ, శిరోజములను వృద్ధిచేసి పోషించేశక్తి కలది. ఈనూనె తయారుచేసే విధానము:—

ఇదివరకు చెప్పినట్లుగానే, పెద్దవుసిరికకాయల రసము- గుంటకలగర ఆకురసము, అరటిచెట్టుకు భూమిలోవుండే దుంపరసము, ఈమూడురసములు సమభాగములుగా తీసుకోవాలి- మనకు అవసరమైననూనెను బట్టి ఒకగ్లాసు కొలతగా ఉంచుకుని పైమూడు రసములు మూడు గ్లాసులు, 2 గ్లాసులు కొబ్బరినూనె, అన్నికలిపి కుండలోపోసి, సన్నని సెగతో పొయ్యిమీద పెట్టి కాచాలి. రసములు యిగిరాక

సుగంధ ద్రవ్యములు వట్టివేళ్లు- కచ్చూరాలు- పచ్చాకు- బావంచాలు- రకానికి $\frac{1}{2}$ తులంచొప్పున తెచ్చి ఎండబెట్టి చూర్ణము చేసుకోవాలి. మందార పువ్వులు- సంపంగిపువ్వులు తెచ్చి ఎండబెట్టి చూర్ణము చేసుకోవాలి. పువ్వుల చూర్ణము 4 తులాలు వుండాలి. పొయ్యిమీద మరిగిననూనె క్రిందకు దింపి, ఈ రెండురకముల చూర్ణములు నూనెలో వేసి, బాగా కలిపి మూతపెట్టాలి. చల్లారిన తరువాత గుడ్డలో వడపోసి సీసాలోపోసి ప్రతిరోజు తలకు రాసుకుని తల దువ్వుకొనవచ్చును. తలదిమ్ము, నేత్రరోగములు, పోగొట్టి, మేహశాంతి నిచ్చును.

బాల్యములో నెరసిన శిరోజములు నల్లబడుటకు పురుగుడుపండ్లు- గోరింటాకు- తామరతూండ్లు- తాడికాయలు నానబెట్టి రసము తీయాలి. గుంటకలగర ఆకు రసంకూడ తీయాలి. ఈరసములు దినుసునకు ఒక్కొక్క శేరుచొప్పున రసములు తీసుకుని యినుపత్రుప్పు 6 తులాలు, కవిరి పొడరు చేసినది 9 తులాలు కుండలోపోసి, నువ్వులనూనె వీశ నిమ్మపండ్లరసము 14 ఫలములు, అన్ని కలిపి ఒకకుండలోపోసి సన్నని మంటతో తైలపక్వముగా వండవలెను. క్రిందకు దింపి చల్లారినతదుపరి, వడియపోసి గాజుసీసాలో జాగ్రత్త పెట్టుకుని, ప్రతిరోజూ స్నానం చేయుటకుముందు తలకు మర్దనచేసుకుని ఒకపావుఘంట అయిన తరువాత, పెసర పిండితోనైనా సీకాయతోనైనా శిరోజములు రుద్ది స్నానం చేయవలెను, దీనివలన శిరస్సంబంధమైన వ్యాధులు (రోగములు) కూడా పోవును.

ఆదివారం-అగచాట్లూ!

శ్రీ సాయినాథశాస్త్రి

ఆదివారం వొచ్చిందంటే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యేవాళ్లు లక్షమంది! అదేం ఖర్మో గానీ ఆదివారం వొస్తోందంటే చాలు, నాకు దిగులు ప్రారంభమౌతుంది. ఇది విని మీలో చాలమంది (కనీసం నూటికి తొంభైమందన్నా) హేళనచేస్తారు; ఆశ్చర్యపోతారు. నిజమే! అయినా ఏం చేసేది చెప్పండి? చూడండి, ఉదాహరణకు మొన్నటి ఆదివారం ముచ్చట్లు,— అదే నాఅగచాట్లు!

ఆదివారం శలవగదా! అందుకని హాయిగా ఏపదింటిదాకానో తీరిగ్గా నిద్రపోవాలనిపిస్తుంది నాకు. అందుకనే ముసుగు బిగదన్ని పడుకున్నా. ఎప్పుడు లేచిందో మా శ్రీమతి తనపనులన్నీ ముగించుకుని 6–30 కల్లా రేడియో పెట్టింది. పోనీ, అది సౌండ్ తగ్గించివున్నా యిబ్బంది వుండదు. ఓ! అరడజనువూళ్లకి వినపడేలాగా పెట్టింది. నిజంగా అప్పుడెట్లా వుంటుందో మీరే చెప్పండి? నాకు మట్టుకు ఆ రేడియోకాస్తా ఏ స్నేహితుడికో యిచ్చిపారేద్దామనిపించింది. ఆ రేడియో కొనేదాకా నాప్రాణాలు తోడేసింది. పోనీలే. నేలేనప్పుడు కాస్త కాలక్షేపంగా నన్నా వుంటుందని చెప్పి బుద్ధిగడ్డితిని ఎరక్కపోయి కొన్నా. అదే నాకిప్పుడు ప్రతిబంధకం అయింది.

"అయినా లెక్కజెయ్యకుండా పడుకోరాదా, జోల పాడినట్టు వుంటుందే! ఎందుకు మీకంతకోపం?" అని మీరు నన్ను కోప్పడవచ్చు. అందుకనే అలాగే సంతృప్తి పొంది కదలక, మెదలక పడుకున్నా. అప్పుడేం చేసిందో తెలుసా? తీరిగ్గా వొచ్చి నేను ముసుగుపెట్టుకున్నదుప్పటికాస్తా లాగేసి "ఏమండీ! మిమ్మల్నే! అబ్బ! ఒహటే నిద్రా? మీకేచెప్పేది!" అని నెమ్మదిగా మొదలెట్టింది. నేనట్లాగే కదలకుండా, కళ్లు తెరవకుండా పడుకున్నా. నా చెవిదగ్గిర నోరుపెట్టి చెవులుబద్దలయ్యేలా యిందాకటి మాటల్నే ఉచ్చరించింది. ఇంకేం చెయ్యమంటారు చెప్పండి? నోరుమూసుకుని లేవకతప్పదు. నాక్కోపం వొచ్చింది. మా శ్రీమతి పన్లకి. అదేమిటో మా శ్రీమతిని ఎప్పుడు కోప్పడదామన్నా కుదరటంలేదు. అసలు మా శ్రీమతి మొహం చూసేప్పటికే కోపంకాస్తా పక్కకి తప్పుకునేది. అందుకని యీసారి మొహంకేసి చూడకుండానే కోప్పడ్డా.

"ఓయబ్బ! తెల్లారిపోతే యింకా నిద్రేమిటి బాబూ! ఇదుగో ముందుగానే చెబుతున్నా. కాఫీ చల్లారిపోతోంది. తరవాతమాత్రం నేవెచ్చబెట్టేది లేదు" అంటూ వెళ్తోంది.

కాఫీ లేకపోతే నాకొక్కక్షణంకూడా తోచదని మా శ్రీమతికి తెలుసు. అందుకనే నామీద బ్రహ్మాస్త్రంలా ప్రయోగించింది. రోజుకి నాలుగైదు సార్లన్నా కాఫీ తాక్కపోతే నాకేమిటో పిచ్చెత్తినట్టుగా వుంటుంది. అందులోనూ బాగా సలసలా మరిగే కాఫీగానీ గుటకపడదు. అందుకని గభాల్న లేచి బాత్‌రూమ్‌కి పరిగెత్తాను. వెనకాలే నవ్వుకుంటూ బ్రష్షు పేస్టూ సరంజామా అంతా పట్టుకుని తయారయింది, మా శ్రీమతి. అవి నాకందించి "తొందరేంలేదు! నెమ్మదిగానే కానివ్వండి. కాఫీ వేడుతూవుంటా" అంది తాపీగా.

"అరె! ఎంతమోసం! ఇంతవరకూ కాగపెట్టలేదన్నమాట." అనుకుంటూ గబగబా అయిదు నిమిషాల్లో మొహం కడిగిపారేశా. మొహం తుడుచుకుని గదిలోకెళ్లేప్పటికి కాఫీగ్లాసు నాకందించింది. కాఫీచూట్టంతోనే ప్రాణం లేచొచ్చి ఆత్రంగా గ్లాసందుకున్నా న్నేను. ఇంతలో మా శ్రీమతి లోపలికెళ్లింది ఎందుకోమరి! నేను కాఫీ ముగించటం, మా శ్రీమతి ప్రవేశించటం ఒక్కసారే జరిగింది. ఒస్తూనే చేతులోవున్న సంచీ నామీద గిరాటేసి, కాగితం నాచేతులో పెట్టి, చొక్కా తీసి నాకందించింది.

"తెల్లారిందోలేదో అప్పుడే మొదలా? ఇవాళ ఏమైనాసరే! నే పోనివాళ్" అన్నా.

"ప్రతివారం మీకిదో ఆటల్లేవుందే! ఏడున్నరైతే తెల్లారిందో లేదోనంటున్నారా! తొందరగా రావాలి మీరు. లేకపోతే నేను మనపనిచేసే పిల్లచేత హోటలునుంచి క్యారియరు తెమ్మంటా. తరవాత నన్నని, ప్రయోజనం లేదు." అని ముందుగానే హెచ్చరించింది.

'తప్పదురా బాబూ! అనుకుంటూ. వెంటనే మూలనున్న జోళ్లువేసుకుని, గొడుగుతీసుకుని బయల్దేరా. తీరా సందుమలుపు తిరిగి నాలుగడుగులేసేప్పటికి నేతొడుక్కున్న చొక్కాజేబులో మనీపర్సు లేదనీ, దాన్ని కిందటి రాత్రే తీసి డ్రాయర్లో పెట్టాననీ గుర్తొచ్చింది. మళ్లీకాళ్లీడ్చుకుంటూ ఇంటికి చేరాను.

"ఏమిటి మళ్లీ వొచ్చారు? ఏమన్నా మరిచిపోయారా?", అనడిగింది చిరునవ్వుతో. ఉన్నసంగతికాస్తా చెప్పేప్పటికి వేళాకోళం మొదలెట్టింది- అక్కడికి తనే మాత్రం మరిచిపోవటమనేది ఎరగనట్టు! మొన్న తను ఉప్మాలో ఉప్పువెయ్యటం మరిచిపోలా? ఎవరివి వాళ్లకి బాగుంటై. నేను మెదలకుండా పర్సు తీసుకుని మళ్లీ బయల్దేరా.

మార్కెట్ దగ్గిరికి చేరుకుని అసలు ఏమేమి కావాలో చూద్దామని లిస్టుతీసి వరసగా చూస్తున్నా. ఇంతలో మా ఫ్రెండ్ శ్రీనివాసరావు కనిపించాడు. ఆమాటా, యీమాటా మాట్లాడుతూ 'హోటల్ డిలైట్' కి నడిచాం. మావాడు ఏవేవో రాజకీయాలు మాట్లాడతాడు; అవి వింటానికి నాకు తీరికెక్కడుంది! అట్లాగని నాదోవన నే పోదామంటే వొదలడుగా! అట్లాగే వాడి వాగుడంతా వింటూ కూర్చున్నా. ఇంతలో రోడ్డుమీద ఎవరో పోతూంటే "ఒరేయ్! ప్రకాశం" అంటూ పరిగెత్తాడు నాతో చెప్పకుండానే. మళ్లీగాని వొస్తాడేమోనని ఒకపావుగంటసేపు అక్కడే కూర్చున్నా. అబ్బే! అయిపూ అంతూలేదే! నెమ్మదిగాలేచి, సర్వరు అందిచ్చిన రూపాయిన్నరబిల్లూ చెల్లించి బైటపడుతుండగా హోటలుగడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

అక్కణ్ణుంచీ మళ్లీ మార్కెట్టుకి చేరుకుని, మా శ్రీమతి యిచ్చిన లిస్టుప్రకారం అన్నీ తీసుకున్నా. ఆసామానంతా చూసేప్పటికి నాగుండె గుభేలుమంది. ఆసామానంతా నేనొక్కణ్ణే మోసుకుపోవాలంటే మాయింటినుంచీ యిక్కడికి ఎన్నిసార్లు తిరగాలా అని ఆలోచిస్తున్నా. తెక్కతేలటంలేదు. ఇంతలో ఒకకూలిమనిషి వొచ్చి నాతో చెప్పకుండానే సామానంతా గంపలో పెట్టుకుని, నెత్తిమీదికెత్తుకుని రండిబాబూ! పోదాం." అన్నాడు. అప్పుడిక వొద్దంటాననుకోండి, పెద్దపొట్లాటవుతుంది. పోనీగదా అని, వాడితోబాటు యింట్లో ప్రవేశించానా, యింటిదగ్గిర మా శ్రీమతి- "ఈమాత్రందానికే కూలీ కావాలన్నమాట. అంతస్తేమిటి! మనసామాను మనం తెచ్చుకుంటే మనపరువు కాస్తా పోదూ! హవ్వ! ఎవరన్నా నవ్వుతారనేనా లేదేం మీకు. ఇట్టాఅయితే నావల్లగాదు బాబూ యీకాపరం చెయ్యటం!" అంటూ మంగళహారతి పాడేస్తుంది, ఎలాగురా భగవంతుడా యీగండం గడవటం, అని ఆలోచిస్తూండగానే కూలీ నడవటం మొదలెట్టాడు. నేనింకా కాసేపు ఆలోచిస్తూ నిలబడ్డానా? అతనవి పుచ్చుకుని చక్క పోగలడని భయమేసి వాడివెనకాలే బయల్దేరా నాదురదృష్టాన్ని తిట్టుకుంటూ!

ఇంటికి చేరుకునేప్పటికి తలుపువేసున్నై. నాకోఆలోచనతట్టింది. కూలీకి డబ్బిచ్చిపంపేసి, తలుపుతట్టాను. మా శ్రీమతి వొచ్చి తలువుతీసింది. ఆసామానంతా నేనే తెచ్చాననుకుని ఆశ్చర్యపోయింది. లోపలికి చేరేశా ఆసామాను. మాశ్రీమతి మళ్లీమొదలెట్టింది-. ఏమండీ! మిమ్మల్నే ఆసామానంతా మీరే మోసుకురాకపోతే. ఏకూలాణ్ణన్నా పిలవకపోయారా? లేకపోతే రిక్షాచేయించుకుంటే పోయేదిగా? బజార్లోవాళ్లంతా నన్ను ఆడిపోసుకోవాలనేగా మీరిట్టా చేసింది అంటూ. నేతెచ్చినవన్నీ సర్దుతోంది, ఇంతలో కంగారుగా ఏమిటో వెదుకుతోంది.

"ఏమిటి వెదుకుతున్నావ్? ఏమన్నా రాలేదా?" అన్నా కాలరు సర్దుకుంటూ-

"మీరు తీసికెళ్లిన గొడుగేదీ?" అనడిగింది ఆత్రుతగా!

హారిభగవాన్! ఏంకర్మ మొచ్చి పడిందిరా బాబూ. గొడుగుని ఎక్కడ మరిచిపోయానో గుర్తురావటం లేదు. మొన్ననే కొన్నా. ఎండలు మండిపోతున్నాయని. కొట్టతనుగూడా ఫస్టుక్వాలిటీ అని చెప్పి పదిన్నర కొట్టేశాడు. దానిమీద మాశ్రీమతి అందంగా పట్టుదారాల్తో నాపేరు కుట్టింది మారుపడిపోకుండా. అటువంటి కొత్తగొడుగుని కాస్తా ఎక్కడో వొదిలేశా. ఇప్పుడేం సమాధానం చెప్పాలి! గొడుగు పోయిందని తెలిస్తే మాశ్రీమతి అసలు నన్ను యింట్లో వుండనిస్తుందా? అనుకుంటూ వుండగానే మాశ్రీమతి—

"ఏమండీ మాటాడరేం? గొడుగేదండీ? ఎక్కడన్నా మంగళం పాడేశారా?" అనడిగింది మళ్లీ నిగ్గదీస్తూ.

"గొడుగా?" అన్నాను అమాయకంగా మొహంపెట్టి. "ఆఁ! గొడుగే! బిందగానీ, చెంతాడుగానీ అనుకున్నారా? గొడుగుసంగతే అడిగేది. ఏంచేశారూ?" అంది విసుగ్గా కోపంతో.

"అక్కడే ఎక్కడో వుంటుంది చూడు" అన్నాడు శాంతంగా. "అదేమిటండీ! యిందాక తీసికెళ్లారుగా! నేననుకుంటూనేవున్నా— అదికాస్తా ఎక్కడో వూరేగిస్తారని. నాకుతెలిసుదూ మీసంగతి! అయ్యో! కొత్తగొడుగు" అంటూ నిట్టూర్చింది.

ఇంతలో చటుక్కున గుర్తొచ్చింది హోటల్లో బిల్లు చెల్లించేటప్పుడు టేబులికి తగిలించానని. గబగబా బైటికి పరిగెత్తా వరండాలోవున్న నాసైకిలు తీసుకుని. జోరుగా తొక్కుకుంటూ పోయా; వెళ్లి కర్చిఫ్‌తో మొహం తుడుచుకుంటూ, కాషియర్‌తో- "ఏమండీ! యిందాక మిమ్మల్ని

మాస్తూండమని నాగొడుగు యిక్కడ తగిలించివెళ్లా. అది యిప్పిస్తారా నేవెళ్లాలి" అన్నా. నే నిజానికి చెప్పలేదు. అయినా అట్ట అడక్కపోతే దొరకదుగా.

ఆయన నొచ్చుకుంటూ "అయ్యయ్యో! మీరు చెప్పింది నేవిన్లేదండీ! ఇందాకట్నుంచీ ఎవరిదా? ఎవరిదా? అని అనుకుంటున్నాం. ఇప్పుడే మాఅబ్బాయి అల్లా బజారుకి వేసుకెళ్లాడు. వొస్తాడు కూర్చోండిసార్." అన్నాడు. నాగుండెలు కుదటబడ్డై. పోయిందనుకున్న గొడుగు దొరికింది. ఆసంతోషంతో సర్వర్‌ని ఒకడబుల్ స్ట్రాంగు కాఫీ తెమ్మన్నా. అది తాగి కాసేపు నిశ్శబ్దంగా కూర్చున్నా.

ఎంతసేపటికి రాలేదు. పదకొండున్నరైంది. ఆయన్ని మళ్లీ అడిగాను. ఆయన వాళ్లపనిమనిషిని పిలిచి. నాసైకిలిచ్చి పంపించాడు. మరో పావుగంటకల్లా అతడు నాగొడుగుతోసహా వొచ్చివాలాడు. బ్రతుకుజీవుడా అని, గొడుగు సైకిలికి తగిలించుకుని బయల్దేరా. సరిగ్గా వందగజాలు పోయానోలేదో, సైకిలు మరి నడవనని సహాయనిరాకరణోద్యమం ప్రారంభించింది. ఎప్పుడూ ఎరగను అది ఎదురు తిరగటం. అది గనక బాగుచేయించకపోతే రేపు ఆఫీసుకి పోవటం కుదరదు. వెంటనే సైకిల్ షాపులో ప్రవేశించాను సైకిల్తోసహా. అతనదంతా విప్పి "రేపుదయం రండిసార్! బాగుచేసి వుంచుతా" నన్నాడు. ఉసూరుమంటూ, చేసేదేంలేక రిక్షాకట్టించుకుని బయల్దేరా.

ఇంటికి చేరుకునేప్పటికి ఒంటిగంటైంది. నేను ఆలస్యంగా వొచ్చినందుకు మాశ్రీమతికూడా ఏం అనలేదు. (గొడుగు దొరికిందిగా అందుకని. లేకపోతేనా! అమ్మో!) గబగబా స్నానం అదీ ముగించి యిద్దరమూ భోజనం కానిచ్చాం. కాసేపు నిద్రపోదామని నడుంవాల్చా. మాశ్రీమతి నాకుదగ్గర్లోనే ఒక యీజీఛేర్లో వాలింది వొయ్యారంగా. కాసేపాగి "ఏమండీ!" అంది ముద్దుగా.

కొంపమీదికి ఏదో రాకెట్‌లాంటిది రాబోతోందని కళ్లుమూసుకున్నా.

"మిమ్మల్నే!" అంది మళ్లీ.

"ఊఁ!" అన్నా మత్తుగా నిద్రతూగుతున్నట్టు.

"ఇవాళ సినిమాకెళదాం. అదేదో సరస్వతీ టాకీస్‌కి వొచ్చిందటగా! చాలా బాగుందట" అంది.

నేనదేం వినిపించుకోనట్టుగా పడుకున్నా, కళ్లుమూసుకుని. ఇంతలో సుడిగాలిలా వొచ్చి పడ్డాడు మాసుబ్బారాయుడు "ఒరేయ్!" అంటూ. మాశ్రీమతి అతనిరాకకు విసుక్కుంటూ "మీరుమాత్రం తొందరగా మాట్లాడి అతన్ని పంపేయండి. లేకపోతే సినిమాటైము దాటిపోతుంది మరిచిపోకండి" అంటూ లోపలికి నిష్క్రమించింది. మాసుబ్బారాయుడు లోపలికొచ్చాడు. కళ్లు తెరచిచూశా వాడిచేతులలో కనీసం రెండు మూడు దస్త్రాల కాగితాలున్నై. చచ్చాన్రా బాబూ! అనుకున్నా. ఎందుకో తెలుసా? మావాడు ప్రతివారం తప్పకుండా వొస్తాడు నాదగ్గిరికి తను ఆవారం రోజుల్లో రాసిపడేసిన చెత్తంతా నాకు చదివి వినిపించటానికి. ఇప్పటికే మావాడి సంపూర్తి రచనలు, అసంపూర్తిరచనలు అన్నీ గలిపి ఓబండెడుంటై. అవన్నీ ఉపయోగిస్తే ఒక నెలరోజులికి వంటచెరుకు అవసరం వుండదు. అదేంఖర్మో, యింతవరకూ ఒక్కటన్నా ప్రింటయిన పాపాన పోలేదు. పాపం! అవన్నీ వినిపించందే వాడికి నిద్రపట్టదు. నాఖర్మ గాకపోతే ఎండలో తిరిగితిరిగి వొస్తే కాస్త పడుకోటానికన్నా ఆస్కారం లేకపోయింది. "ఇప్పుడే వొస్తా"నని లోపలికెళ్లి మాశ్రీమతిని కాస్త తొందరగా కాఫీపెట్టమని చెప్పి మరీవొచ్చా.

మావాడు మొదలెట్టాడు, ఒక్కొక్క కాగితమే తిరగేస్తున్నాడు. నాతలనొప్పిగూడా ఒక్కొక్క మోతాదు హెచ్చుతోంది. ఎండలోతిరిగాను, దానిమీద యిదోటి. బుర్ర రెండుగా చీలిపోతుందేమో ననుకున్నా. ఇంతలో మాశ్రీమతి పుణ్యమా అంటూ కాఫీతెచ్చింది. రెండు ఏస్ప్రోబిళ్లలు వేసుకొని కాఫీతాగాను. కాస్త ప్రాణం హాయిగావుంది. కానీ ఆపడుగా మావాడికవితాధార!

ఇంతలో లోపల్నుంచీ అలారం టైంపీసు గణగణామంది. మావాడు చటుక్కున టైం చూసుకున్నాడు. నాలుగూనలభై అయిదు నిముషాలైంది. "మళ్లీ వొచ్చేవారం వొస్తా. కాస్తపనుంది. అర్జెంట్. ఏం అనుకోకు" అంటూ గబగబా వెళ్లిపోయాడు. నామొహం! నేనేం అనుకుంటానూ వాడెళ్లిపోతే. ప్రాణం తెరిపినపడింది!

మాశ్రీమతి వొచ్చి "త్వరగా తెములండి. ఇక్కణ్నుంచీ అరగంట పడుతుంది హాలుదగ్గిరికెళ్లాలంటే. మనం కాస్త ముందుగానే పోదాం! కిందటిసారి ఆఖరికెళ్లేప్పటికి ఛాన్స్ లేకుండా ఎక్కడోమూల కూర్చున్నాం. ఉక్కపోసి చంపింది" అంది గబగబా!

మాట్లాడకుండా టవల్లు తీసుకుని బాత్‌రూముకేసి వెళ్లా. నేనుస్నానాలు ముగించుకొచ్చేప్పటికే, మాశ్రీమతి అప్పనసలా తయారైంది. గబగబా డ్రెస్ చేసుకుని, బూటు వేసుకున్నా. మాశ్రీమతి పురమాయింపుతో రిక్షాపిలుచుకొచ్చా. తలుపులకన్నిటికీ తాళాలేసి రిక్షాఎక్కాం. సినిమాకెళ్లాం.

సినిమా చూసి మళ్లీ యింటికిచేరుకునేప్పటికి పదింబావు అయింది. అప్పుడు భోజనంచేసి కబుర్లుచెప్పుకుంటూ పడుకున్నాం. ఏముంది మళ్లీ తెల్లారితే ఆఫీసు. ఊపిరి సలపనంతపనిలో సతమతమై పోతూంటాం. ఆఫీసుంటేనే నాప్రాణాం హాయిగా వుంటుంది. ఆఫీసు వొదిలింతరవాత ఇంటికొచ్చి కాసేపు డాబామైనో, మాయింటిముందున్న మల్లిపందిరికిందో మాశ్రీమతితో కబుర్లాడుతూ రెస్టుతీసుకోవచ్చు.

ప్రతిఆదివారం యిల్లానే వుంటుందా? అని మీరడగవచ్చు. కొంచెం హెచ్చుతగ్గుగా యిల్లాగే నడుస్తోంది యింతవరకూ. ఇక ముందేమవుతుందో చెప్పలేను, గాని అదివారం ఎవళ్లో వొహళ్లు రావటంతో తీరికే వుండదు. అందుకనే ఆదివారం వొస్తోందనేప్పటికే నాకు భయంపుడుతుంది ఏం? ఇప్పుడైనా నాబాధను మీరొప్పుకుంటారా మరి?

కనువిప్పులో మబ్బు

శ్రీ సన్నాకుల సుందరరావు

"శాంతా!.... ఎన్నిసార్లు ప్రాధేయపడాలి. ఇలా అయితే ఎలా? నీచేతులు ఎలా బొబ్బలెక్కాయో చూడు. పద్మ వుండగా అంత అవసరమేమొచ్చింది; శాంతా?" శేఖర్ మృదువుగా శాంతచేతిని తనచేతిలోకి తీసికుని నిట్టూర్చాడు.

"పాలు పొంగుతున్నాయేమో చూద్దామని తడుములాడుతుండగా పొరపాటున నిప్పుమీద చేతులుపెట్టాను. అయినా అంతబాధగా లేదులెండి, కొద్దిసేపుమాత్రం నొప్పి అనిపించాయి" బాధను దాచిపెడ్తూ, లేనిఉత్సాహాన్ని మాటలలో వ్యక్తంచేసింది; శాంత.

"బజారులో పద్మ చెప్పింది శాంతా!.... ఇలా అజాగ్రత్తగా జీవితాన్ని మరచిపోతే నన్నేంచెయ్యాలని నీఉద్దేశం?" ఆమాటవింటూనే అతృతతో ఇలా వచ్చేశాను. నాకా మాట ఇవ్వుశాంతా!.... చెప్పు, మరెన్నడూ అలా ప్రయత్నించవుకదూ?" పెన్సిలిన్ ఆయింటుమెంటు శాంత చేతికి రాస్తూ, శాంతమొహంలోకి చూశాడు.

శేఖర్ వాగ్ధోరణికట్టిపెట్టి ఇరువురిమధ్యా మౌనముద్ర వచ్చిందంటే, ఆయన తనను అదోలా చూస్తారని శాంతకు తెలుసు. అతని కళవళికల్ని చూపుల్ని తను చూచేభాగ్యం లేకపోయినా స్పర్శద్వారా, విడిచే నిట్టూర్పులద్వారా శాంత అంతా గ్రహించగలదు.

"ఏమిటండీ, అలా కొత్తగా చూస్తారు. రోజురోజుకూ నాలో క్రొత్తదనం ఉట్టిపడుతుందా ఏం? మీకు మాట యిస్తున్నాగా; మీతోడు ఇంకోసారి ఇలా ఎన్నడూ చెయ్యను. నాఅవివేకంతో మిమ్మల్ని దూరంచేసికోను, నన్నుక్షమించండి" శాంత, రెండుచేతులూ అతనిపాదాల కోసం తడుముతున్నయ్.

"శాంతా!.... అంతపొరపాటు నీవల్లేంజరిగింది? ఆసంగతి మరచిపో; చక్కగా విశ్రాంతి తీసుకో, ఏమైనా కావలిస్తే నేనిక్కడే వుంటాను. నన్ను లేపు, మళ్లీ, మాట మఱచిపోవద్దుసుమా!"

శాంత వీనుల్లో శేఖర్ మాటలు గోముగా లయ పాడుతున్నయ్. అతనిమాటలకు సమాధానంచెప్ప అవసరం లేదనుకుంది. శాంత, మౌనంగా, తలవూపి ఈజీచైరులో మేనువాల్చింది.

"నేను అబద్ధం చెప్పటం లేదక్కా. ఇన్నాళ్లూ బావ గురించి నీకు అపార్థంగా ఏమైనా నీతో చెప్పానా? ఆయన గదిలో గంటలతరబడి పెయింట్ జేస్తుంటారు. నేను కళ్లారా చూశాను శాంతా?"

"నేను నమ్మలేకుండా వున్నాను, పద్మా. ఆయన అలా చేస్తారంటే నాఅంతరాత్మ ఏమాత్రం ఒప్పదు. నువ్వు ఆయన్ని తప్పుగా అర్థం చేసుకున్నావేమో?"

"లేదు. అక్కయ్యా, బావ గదిలోకి నేను వెళ్లేసరికి ఆతృతగా ఆబొమ్మను పెట్టెలో పెట్టేశారు. ఆమెను నేను బావతో మాట్లాడుతుండగా చూశాను కూడా, నాకళ్లు అంత అన్యాయానికి పాల్పడవు శాంతా!"

శాంత పద్మ అందించిన పాలగ్లాసు అందుకోకుండా ఆమెచేతులు హృదయానికంటే ఉధృతంగా వణకుతున్నయ్. హృదయం బాధతో ఉడికిపోతూంది. గ్లాసు చెయ్యజారి గచ్చుమీదపడి పాలు చేతిమీద పడినాయ్.

"పోతే పోయిందిలే పద్మా. నాలాంటిజీవితం బాగుపడే అదృష్టం నాకులేదు. నాఖర్మకు ఎవరని ఏంలాభం లేదు."

"అలా అని నీవు ఆహారం మానేస్తే ఆరోగ్యం సంగతి ఆలోచించడం మానేస్తావా శాంతా?" పద్మ చెయ్యి మృదువుగా శాంతభుజంమీద పడింది.

శాంత రెండుచేతులతోనూ మొహాన్ని దాచుకుంది. ఆమెబాధ కన్నీటివెల్లువలో ప్రవహిస్తుంది.

"నాకు ఆకలిగాలేదు పద్మా; పళ్లెం అక్కడపెట్టి నీవు పడుకో, వారు వచ్చింతర్వాత తప్పకుండా భోంచేస్తాను. నాగురించి, నీవు కూడా నీఆరోగ్యం పాడుచేసుకుంటే మాకున్న ఒక్కఆధారమూ నీవే పద్మా, జన్మజన్మలకూ నీఋణం తీర్చుకోలేను. వచ్చేజన్మలో తప్పకుండా నీతో బుట్టువుగా పుడతాను" శాంతకంఠం గాద్గదికంగా, వెలవెలపోయింది.

"ఇందులో ఋణాలు ఏమున్నయ్. అక్కయ్యా! నాకుమాత్రం ఎవరున్నారు? నీమంచి–చెడూ చూడటమే నాకానందం." రగ్గుకప్పుతూ, పద్మ ఆఖరుమాటలు అని. లైటు ఆర్పేసి వెళ్లిపోయింది.

లైటు స్విచ్ ఆఫ్‌చేసినట్లు శబ్దాన్నిబట్టి శాంత, తెలుసుకుంది. ఆమె అంధకారంలో నిద్రమత్తుగా ఆవలించి, దుప్పటి సరిచేసుకుంటూ బాధగా నిట్టూర్చింది.

శాంతమనసు కారుమేఘాలలో పయనిస్తుంది. కారు చీకట్లమబ్బులలో వెలుగుకోసం ఆమెనేత్రాలు వెతుకులాడుతున్నయ్, బాల్యంనుంచీ అంధకారం శాంత జీవితంలో గడ్డుసమస్యగా నిలచిపోయింది. అడ్డుగా అలుముకుపోయిన అంధకారపు గోడలు ఊహించిన వెలుగు కిరణాలతో పగిలిపోయి మార్గం సుగమ్యమైపోయిందని శాంత తలపోసింది, పడిపోయిన బలిష్టమైన గోడల బీటల్ని ఆమెహృదయం తిరిగి అతికించి పటిష్ఠంగా చేసింది. ఇప్పుడు శాంతకు, వెలుగుచూడాలంటే ఉత్తర ధృవంలోఉన్నట్టిప్రాణిగా ఆరాటపడుతుంది. జీవితానికి వెలుగంటూరాదు. అది లభించిందని మురిసిపోయిన శాంత మనసు కలలోని ఛాయలా భావించి మదనపడుతూంది.

శేఖర్ చూస్తూచూస్తూ, తన అవిటిబ్రతుకుకు తగినట్లు ఇంతఅన్యాయానికి ఒడికడతాడా? సందేహాన్ని నివృత్తి చేసుకోవాలో ధృఢంచేసికుని మదనపడాలో శాంతహృదయం నిర్ణయించుకోలేకపోయింది. శాంత వెనుకగడచిపోయిన కారుమబ్బుల వెనుకటి జీవితం నృత్యం చేస్తూంది.

సృష్టిలోని మహత్యాన్ని అందాన్ని దృష్టించలేని మానవజీవితం వ్యర్థం. పైరూపు అందాలలో కుళ్లుపట్టిన విషయాలెన్ని మానవజీవితాన్ని నాశనంచేస్తున్నా, అది మరొకమాట. ప్రకృతి తనంతటతానే ప్రాణులమధ్య భేదాలు రూపొందించి సృష్టికార్యం జరిగిస్తుంది. సాఫీగా సృష్టి ఏలోటూలేకుండా సృష్టించిన మానవుల్ని వ్రేళ్లతో లెక్కించవచ్చు. అయితే లోటుగల వ్యక్తులు అడుగడుగునా జీవితాలలో తారపసడుతూనేవుంటారు. అవయవాలకూర్పులలో ప్రకృతిలోపం చేస్తే; వ్యక్తిత్వాల పొందికలలో సమాజం పైచెయ్యివేసింది.

శాంతకు, వేటితో మానవుడు సృష్టిలో జరుగుతున్న చిత్రవిచిత్రాలు చూసి బాధపడుతూ సతమతమౌతున్నాడో ఆరెండుజ్యోతులూ లేవు. ఆమెనేత్రాల్ని సృష్టి మబ్బు తెరలతో నింపివేసింది. ఆతెరలు, తొలగించుకుని వెలుగును చూసేశక్తి, హక్కు శాంతకు లోపించిపోయింది. ఎన్నిశక్తులు సంపాదించినా, విజ్ఞానపరిశోధనలు చేసినా, ప్రకృతియుతమైన అసాధరణశక్తులముందు మానవజాతి తలఒగ్గి తీరుతుంది. తమ పరిశోధనలలో సాధించిన విజయాలు ప్రథమాక్షరాలలో మిళితంగా పరిణమిస్తయ్. మొట్టమొదటిమెట్టులోనే వున్నట్లు అనిపిస్తుంది.

శాంతకు భర హృదయం తాలుకుసౌందర్యం, మాటలలో మాందవంతప్పితే, శేఖర్ రూపురేఖలు అవగతం చేసికోలేకపోయింది. అసలు తనకు వివాహమేకాదని శాంతకాదు; కుటుంబంఅంతా బాధపడిపోయింది. కట్నాలమొత్తం ఎంతచేసినా సంసారంలో శాంత స్త్రీకి కావలసిన ఆనందం పొందుతుందని ఊహించలేదు. విధి శాంతవైపే మొగ్గు చూపింది. అవిటిబ్రతుకుకు అనందం దూరంగా వుంటుందనే అపోహ శాంతహృదయంలో నామరూపాలు లేకుండా మాసిపోయింది. ఏజీవితమైతే ముళ్లతో నిండి నడవటానికి గడ్డుగా వుంటుందో ఆజీవితంలో పువ్వులు వికసిస్తాయని; శాంత గ్రహించటానికి అంత ఆలస్యంకూడా కాలేదు.

వివాహప్రస్తావన వచ్చేసరికి శాంతమనసు కొద్దిగా గాయపడి స్పందించింది. వర్ణాంతరవివాహం ఫలించదని; సమాజం నిర్మించిన సనాతనధర్మం కులాలకట్టుబాట్లు విచ్ఛిన్నంచేశాక; సంఘస్థులు ఆదరించరని శాంత ఎంతో కుమిలిపోయింది. తనకు కాబోయే భర్త ఎలాటి కురూపి అయినా తను చూడలేదు. తనఅంధకారంలో వెలుగును చూపిస్తే అంతేచాలు. తనరూపం తనకుతెలియదు. ఎదుటిరూపం ఎలావుంటేనేం? మబ్బుతెరలు కళ్లమీద కప్పి ప్రకృతి తనని సమాజంలో ఒక హీనప్రాణిగా బ్రతకమని ఆదేశించింది. ఆ ఆజ్ఞను శిరసావహించక తప్పదు.

తనపెళ్లి విషయం అన్నయ్య చదువుకంటే ముఖ్యంగా తలపోసి తనజీవితాన్ని సుఖమయం చేస్తాడని శాంత మనసు గ్రహించలేకపోయింది.

"శాంతా!... శేఖర్ నాకు బాగా తెలుసమ్మాయ్. నీకు అన్నివిధాలా తగినభర్త, ముఖ్యంగా మనసు చాలా మంచిది. రోజురోజు విజ్ఞానం వృద్ధిపొందుతున్న యుగంలో కులాలంటూ తలపోస్తే, కాలంగడచిపోదు? శాంతా! నేను అన్నీక్షుణ్ణంగా ఆలోచించి నిర్ణయానికి వచ్చాను. నీ అభిప్రాయిమూ తెలిపావంటే ముహూర్తం ఏర్పాటు చేస్తాం" మాధవరావు ఆప్యాయతగా శాంత తల నిమిరాడు.

"నాగుడ్డిజీవితానికి పెళ్లెందుకన్నయ్యా!.... నేనిలాగే భగవధ్యానం చేసుకుంటూ ఆనందంగా వుంటాను. అస్థిరమైన నాజీవితంలో మరొకరి జీవితాన్ని చీకటిమయంగా చేస్తున్నానేమో ననిపిస్తుంది." శాంత, కనురెప్పల నుండి వేడికన్నీటిబిందువులు చెక్కిళ్లమీదుగా ప్రవహించింది.

'వివాహం' మానవులకు విధ్యుక్తధర్మం శాంతా? నామాటమీద నమ్మకంవుంచు చెల్లీ, తప్పకుండా నీజీవితం

మూడుకాయలూ ఆరుపువ్వులుగా వికసిస్తుంది. కాదనకు శాంతా!"

శాంత దీర్ఘ సమస్యలో పడిపోయింది. కష్టసుఖాలు జీవి రుచిచూడకుండా తప్పదు. ఆడజీవితానికి కష్టసుఖాలు వివాహబంధంలోనే ఉద్భవిస్తయ్. ఆజీవితాన్ని తను నిరాకరించినా, సాంప్రదాయాన్ని బట్టైనా చేసికోకతప్పదు. ముఖ్యంగా తనకోసం బాధపడే వారి బాధ, తను కష్టపడైనా తొలగించాలి. అన్నయ్య మాట తప్పకుండా నిలబెట్టాలి. యుక్తాయుక్తాలు లెక్కేస్తూ కూర్చుంటే; సాధ్యమయ్యే వ్యవహారంకాదు. శాంతమనసును దిటవుపఱుచుకుంది.

"అలాగే!.... అన్నయ్యా నీమాటమీద నమ్మకం నాకుంది. నాజీవితం సుఖంగా గడుస్తుందని నీకు తోస్తే నాకు అభ్యంతరమేమీ లేదురా?"

మాధవరావుకళ్లు ఆనందంగా మెరిశాయి. అతని చేతులు ఆప్యాయంగా శాంత, తలను నిమిరాయి. శాంత బరువుగా అన్నయ్యఒళ్లో తలదూర్చి చిన్నపిల్లలా వెక్కి వెక్కి ఏడ్చింది.

శాంత సన్నజాజి పందిరికింద పేరంటాళ్లమధ్య కూఱ్చుని జీవితచ్ఛాయల్లోని ఆనందాన్ని తలపోస్తూ వుంది.

"శాంతా!.... చాలా అదృష్టవంతురాలివి. మీఆయన ముమ్మూర్తులా మన్మథుడే.... పెళ్లయ్యాక మేము గుర్తుంటామా?" శకుంతలజడలో పూలచెండు వేస్తూ కొంటె ప్రశ్న వేసింది.

"అందమైన మొగుడు దొరికితే; ఒక్క శాంత ఏవిటే, ఎంతమంది స్నేహితుల్ని మరచిపోవడంలా?" వంత పాడింది మాలతి.

శాంతచెక్కిళ్లు సిగ్గుతో ఎఱ్ఱగా మారిపొయ్యాయి.

"అబ్బ!... ఏవిటే మీగోల? వారెంతఅందంగా వుంటేమాత్రం, నాకు కళ్లున్నాయాయేం?" ఉక్రోషంగా జవాబుచెప్పింది శాంత.

"నీకు లేకపోతేయేం? మాకున్నాయిగా? మమ్మల్ని వర్ణించి చెప్పమంటే ఒకటికి నూరుచేసి చెప్పమాఏం?" నవ్వుతూమాలతీ, శాంతబుగ్గలమీదా చిటికె వేసింది.

సన్నాయిమేళాలు వీధికవతల గోలచేస్తున్నాయ్. శాంత మాటలు లౌడ్ స్పీకరుధ్వనిలో మిశితమౌతున్నయ్.

మాలతి లీలగా శాంతను పైకిలేవనెత్తి పెరట్లోంచి నడిపించుకువెళ్లింది.

శాంతహృదయం ఉద్వేగంతో బాధగా కొట్టుకుంటుంది. స్నేహితుల హేళనలతో శోభనంగది తలుపు వఱకూ చేరుకుంది.

"ఏమేశాంతా! .... మీఆయనను చేయూతగా నిలవమని మరీచెప్పు. ఇంకా ఈకఱ్ఱతో నీకు పనేమిటి" మాలతి విసురుగా, శాంతచేతిలోవున్న కఱ్ఱను దూరంగా విసిరివేసింది. మిగతాగొంతుకలు పకపకలాడినయ్. శాంత: సిగ్గుతో అవమానంతో నిట్టూర్చి తలవంచుకుని, గదిలో ప్రవేశించింది. అవతలవైపు బలంగా తలుపు గొళ్లెంపెట్టిన శబ్దంఅయింది. శాంతకాళ్ళు .... బలహీనంగా వణుకుతున్నయ్. పరిచయం వున్న యిల్లైనా సిగ్గుతో కాళ్ళు ముందుకు పోవడంలేదు.

"రా! శాంతా!" శాంతచెవుల్లో మృదువుగా శేఖర్ పిలుపు స్పందించింది.

శాంతను సిగ్గుతెరలు ముచ్చెమటల్లో ముంచివేసినయ్. తలవంచుకుని బొటనవ్రేలితో నేలను గీస్తూ నిల్చుంది. శాంతభుజంమీద అతనిచెయ్యి బరువుగాపడింది. విద్యుల్లత ఆమెశరీరంలో దూసుకుపోయింది.

"బాధపడుతున్నావా శాంతా? కళ్లున్నవాళ్ళు అనుభవించేది ఆనందంఅవదు శాంతా. దానివెనుక ఎంతఅగాధంవుందో నీకుఅర్థంకాదు ఆలోచనలతో సతమతమయ్యే దానివల్ల లభించే దేమీలేదు. నీకు కళ్ళు లేకపోయినా నాక్కావల్సిన హృదయం వుంది. అదే నాకు కావల్సింది: నేను ప్రేమించేదికూడా!" శేఖర్, శాంతచేతిని తన భుజంమీద వేసుకుని. ముందుకు కదిలాడు.

శాంతకాళ్లు బరువుగా అతనిని అనుసరించక తప్పలేదు. "కూర్చోశాంత!"

శాంతకు అంతవఱకూ తను మంచందగ్గర నిల్చున్నాననే తలంపు కలగలేదు. మౌనంగా పరుపుమీద కూర్చుంది. ఆమెనేత్రాలు జలంతో చెమ్మగిల్లిపోయినయ్. శేఖర్ సంభాషణలకు ఆమెహృదయం జవాబు వెదుక్కుంటూ ఆలోచిస్తుంది.

"చూడుశాంతా!.... వెన్నెల పిండారబోసినట్లు కమ్మగావుంది. ప్రకృతిని పరిశీలించి చూడడంలో ఎంతో ఆనందంవుంది. అది క్షణికముమాత్రమే శాంతా? ఉద్వేగాలకూ ఉద్రేకాలకూ లొంగని ఆనందం, మహత్తరమైనది.

తారలకు ప్రాణం వుందోలేదో; వాటికి నేత్రాలున్నాయో లేవో? మనకతీతం. వాటిధర్మం వెలుగును ప్రసరిస్తుండడమే. నీఅందానికి లోటుగా నేత్రాలు లేకపోయినా; నీమొహంలో నిర్మలజ్యోతి వెలుగుదివ్వెను నాకందిస్తుంది శాంతా!'' చల్లనితనచేతుల్ని ఆమెమెడచుట్టూ పెనవేశాడు, శేఖర్.

శాంత తనతలను అతనిభుజంమీద ఆనించి మధుర స్మృతులతో తేలియాడి పోతున్న హృదయానికి పగ్గం వేసింది.

''శాంతా: పుట్టింటిమీద మమకారం అందరికీ వుంటుంది. నేను కాదనడంలేదు. స్త్రీకి జీవితంలో అధిక భాగం భర్తతోనే గడచిపోతుంది. మనం కావాలని కోరినచోట ఉద్యోగం చెయ్యాలంటే మనయిష్టప్రకారం జరిగేదికాదు." శేఖర్ ట్రంక్‌లో బట్టలు పెట్టుకుంటూ అన్నాడు.

శాంత ఈజీచైరులో మౌనంగా కూర్చుంది. ఆమె మనసు బాధగా మూలుగుతూంది. ముందు రాబోతున్న కష్టాలప్రభావం ఆమెమెదడులో నృత్యం చేస్తూంది.

"అవిటిదాన్ని స్వీకరించి మీరు చాలాఅపరాధం చేశారు. నావల్ల మీకు సుఖం ఏముందండి? మీఉపచారాల మీదే నాజీవితం ఆధారంగా వేయడం నాకెంతో బాధగా వుంది. ఆఖరుకు ఈచేతుల్తో మీకింత వంటచేయడానికి కూడా నోచుకోలేదు." సన్నగా ఆమెమాటల్ని అనుకరిస్తూ; వేడిబిందువులు పైటమీదుగా దొర్లుతున్నయ్.

"బలహీనతను తలచుకుంటూ దుఃఖించటంవల్ల జీవితం నరకంగా రూపొందుతుంది శాంతా! నాజీవితం ఎంతో ధన్యమైందనుకుంటున్నాను. నీకు తెలియదు శాంత. కళ్లున్నసమాజం మధ్య నేనెంతగా నలిగిపొయ్యానో; ఆనలుగుళ్లలో జీవించటమంటే రోతవేసింది. జీవితం సుఖవంతంగానూ, ధన్యంగా వుంటుందని నిన్ను నా భార్యగా స్వీకరించాను శాంతా :"

"బండి సిద్ధంగావుంది బావగారు!" ఛలోక్తిగా హెచ్చరించాడు మాధవరావు, శాంత గాఢంగా శ్వాసవిడిచింది.

"చూడునాయనా! ఇన్నాళ్లుకు దేవుడికి దయకలిగింది. మామనసుల్లోనించి భారం దించివేసుకున్నాము. శాంత చాలా అమాయకురాలు బాబూ!.... దానిజీవితానికి మాయనిమచ్చగా భగవంతుడు అవిటిదాన్నిగా చేశాడు. దాన్ని జాగ్రత్తగా చూసికోనాయనా! శాంత, తల్లి శేఖర్‌ను సాగనంపుతూ, మనసులో బాధను వ్యక్తం చేసింది.

శాంత దుఃఖాన్ని దాచుకుని తల్లిపాదాలను స్పృశించి కళ్లకు అద్దుకుంది. ఆమెతలను ప్రేమగా నిమురుతూ "వెయ్యేళ్లు భగవంతుడు నిన్ను పసుపుకుంకుమలతో నింపుతాడు తల్లి" అశీర్వదించింది, తల్లి.

జట్కాబండి భారంగాకదిలింది. తారురోడ్డుమీద గుఱ్ఱంగిట్టలతో ధ్వనిచేస్తూ పరుగెత్తుతూంది. శాంత మనసు ఇల్లు దూరంఅవుతున్నకొద్దీ ఆలోచనలు అధికంగా ఆమె హృదయాన్ని గాయపరుస్తున్నాయ్. ఇలా ఎంతకాలం తన జీవితం అధారభూయిష్టంగా వుంటుందీ అమెకు అర్థంకాలేదు.

ఆడపిల్ల పెళ్లికాకుండా ఇంట్లోవుండకూడదని, సంఘ ఆచారానికి కట్టుబడి తనపెళ్లి జరిగిపోయింది. తనపెళ్లి వల్ల ఎవరికిలాభం? తృటిలో మట్టిలో కలసిపోయే ఈ శరీరాన్ని ఇచ్చుల్ని తృప్తిపఱచుకోవడానికేనా? అంతకంటె నగ్నసత్యం మరేముంది? తను భార్యగా ఆయనకు చేయగలసేవ ఏముంది? పైగా ఆయన ఉపచారాలు తను స్వీకరించకుండావుంటే అంతేచాలు.

రైల్వేప్లాటుఫారం రద్దీలో రణగుణమంటూఉంది. స్టాలువెండర్లు వేసే కేకలతో చెవులు రియ్యిమంటున్నయ్. గార్డు పాసింజర్స్‌కు వార్నింగు ఇస్తున్నట్లు విజిలు వూదాడు. బరువుగా పెనుభూతంలా కూతవేసింది ఇంజన్. పచ్చజెండా ఊగడంతో, మెల్లగా కదిలింది రైలు.

"ఎప్పుడైనా ఒకసారి వచ్చి వెళ్లవోయ్" శేఖర్, మాధవరావు భుజంతడ్తూ అన్నాడు.

"వెళ్తాను శాంతా! అప్పుడప్పుడూ బావకు ఉత్తరం వ్రాస్తుంటాను" అంటూ దూరంగా జరిగిపోతున్న కంపార్టుమెంటు కిటికివైపు చెయ్యిఊపాడు, మాధవరావు. రెండోసారి ఇంజను గట్టిగా కూతవేసి వేగాన్ని హెచ్చించి ది.

శాంతకు మౌనంగా ఈజీచైరులో పడుకొని జీవితంలో ఎదుర్కొనే సమస్యల్ని ఆలోచిస్తూవుంటే బ్రతుకు వ్యర్థమనిపించింది. తనజీవితంఆలోచలో సతమత మనటమేతప్ప అందులో రుచి ఆమెకిసుమంతైనా గోచరం కావడంలేదు. తనొక్కత్తే ఇలా జీవితంలో అపజయాన్ని ఎదుర్కొంటూ విషపూరితంగా గడుపుతుందా? తక్కినవారుకూడా. ఇలానే తమబలహీనతల్ని

వెల్లగిస్తూ సతమతమౌతుంటారా? అందరిబలహీనతలూ అంగవైకల్యాలూ ఒకఎత్తు. తనజీవితం చుక్కాని లేని పడవలాంటిది. అగాధసముద్రాలలో పయనించే బ్రతుకు గల శేఖర్ ఒకత్రాడులాంటివాడు. ఆసహాయంతోనే తను శోకసముద్రంలో, ప్రయాణం చేస్తూవుంది. సముద్రం ఎప్పుడు దూరమౌతుందో. వారధి ఎప్పుడు కన్పిస్తుందో తనకు తెలియదు.

తలుపు తెరుచుకున్న శబ్దంతో శాంత మనసు గుమ్మంవైపుకు వేగంగా పరుగెత్తింది. ఆ అడుగుల చప్పుడు తనకు పరిచయమైనదే. సందేహంలేదు. వారే వచ్చివుంటారు. ఆమెమనసు దిటవుగా భర్తరాకను వ్యక్తంవేస్తూవుంది.

"ఆలస్యమైపోయింది శాంతా! ఒంటరిగా ఏమీ తోచడంలేదు కదూ!.... ఇవాళ హోటలుకుర్రాడు శెలవుపెట్టటం మూలంగా కారియర్ నేనే తేవాల్సివచ్చింది" కుర్చీ శాంత దగ్గరకు లాక్కుంటూ శేఖర్ ఆమెమొహంలోకి చూశాడు.

"ఇవాళ కాస్త కడుపునొప్పిగా వుందండి. మీరు భోంచెయ్యండి. నేను కాస్త కాఫీ పుచ్చుకుంటాను", దిగులుగా జవాబుచెప్పింది శాంత.

"ఏంచెయ్యను శాంత? ఆఫీసుకు తొందరగా వెళ్లే పని వుండటంవల్ల ఈహోటలుభోజనం చెయ్యాక తప్పటంలేదు. రేపట్నుంచీ వీలుగావుంటే నేను వంటచేసి వెళ్తాను." విస్తరిలో నీళ్లు జల్లుకుంటూ నవ్వాడు శేఖర్; శాంత కనుకొలకుల్లో వింతగా ముత్యాల్లా నీరు తొంగి చూస్తూవుంది.

"మీరు వంటచేస్తారా? నేనే ఏదోవిధంగా చేస్తాను లెండి." బాధగా జవాబుచెప్పింది శాంత.

"దానికికాదు శాంత? పొరపాటున నిప్పుల్లో చేతులు పెడితే ప్రమాదం. ఇలా మాబంధువుల్లో ఒకామె చీరకు నిప్పంటుకుని వళ్లంతా కాలిపోయింది" "పోనీ ఎవరైనా వంటమనిషిని ఏర్పాటుచేయండి. లేకపోతే మాఅమ్మగార్ని పిలిపించ మంటారా?"

"వద్దుశాంతా? మీఅమ్మవస్తే చిన్నపిల్లల గతేమౌతుంది? "మామేనమామ కూతురు పద్మవుంది. వాళ్ల నాన్న మొన్ననేపోయారు. నీకభ్యంతరం లేకపోతే పిలిపించమంటావా?"

"ఇందులో అభ్యంతర మేముందండి? అంతా మీయిష్టం." ఆశగా జవాబుచెప్పింది శాంత.

"వెళ్తున్నా శాంతా! భద్రంగావుండు. మంచంప్రక్కనే టేబుల్‌మీద ఫ్లాస్కువుంది. మంచినీరు కావాలంటే కుడిచేతివేపు కూజాకూడావుంది. ఆఫీసువదలగానే తొందరగా వచ్చేస్తాను." అంటూ బయటకు వెళ్లాడు శేఖర్.

శాంత! తన దురదృష్టానికి బాధగా రోదించింది. తన బాధకుతగట్టు. ఆయన సరదాలూ— అవివదలి తన ఊడిగం చేస్తుంటే, ఎంతోబాధతో తన హృదయం నిండిపోతుంది. నిజంగా శేఖర్ పిచ్చివాడు. లేకపోతే చూసి చూసి జీవచ్ఛవంలాంటి కళాకాంతులు లేని తనను వివాహం చేసికుంటాడా? చదువుకున్నవాడు, నాగరికత తెలిసినవాడు, ఇలా తనని భార్యగా స్వీకరించి తనజీవితాన్ని గడ్డుసమస్యగా చేసికొన్నాడు.... పాపం ఆయన కిదొక సంతోషమేమొ? లేకపోతే యింత త్యాగం ఎలా చేయగలిగాడు? బహుశా ఆయన జీవితంలో ఏదో పెద్ద అపజయం పొందివుంటారు. అదే.... ఆయన లోకాన్ని అసహ్యించు కోవడానికి కారణమేమో?....

ఆలోచనల్తో శాంతకళ్లు మూతలు పడుతున్నయ్. పుత్తునా ఆవలించి ఈజీచైర్‌లో కూలబడింది.

పద్మవచ్చాక శాంతకు ఊపిరి పీల్చుకోవడానికి ధైర్యంవచ్చింది. పద్మ ముభావంతో తనపైవున్న జుగుప్స అర్థంచేసికోలేక పోయింది. వచ్చినక్రొత్తలో శేఖర్ విశాలహృదయుడని చెప్తుంటే శాంతహృదయం ఆనందంతో గంతులువేసేది.

ఆమె హృదయంలో ఇప్పుడు విషబీజం నాటుకుపోయింది. వారు అంత అన్యాయం చేస్తున్నారు, సందేహంలేదు. ఆదర్శాలు ఉద్వేగాలు వున్నంతవరకే గాని కాలం జరిగిపోతున్నకొద్దీ అనురాగం తగ్గిపోతుంటుంది. నిజానికి తనవల్ల ఆయనకు లభించిన సుఖమేమిటి? యాంత్రికంగా సంసారధర్మాన్ని నిర్వర్తించడం తప్పితే అందులో సుఖానుభూతి ఏముంటుంది?

"నాకు విశ్వాసం వుంది శాంతా!.... నీకు తప్పకుండా చూపువస్తుంది. ఆపరేషన్ చేయించుకోక తప్పదు. ఇది నాఆనందం కోసంకాదు శాంతా! నీ ఆనందం పెంపొందటానికే. శర్మ ప్రముఖ వైద్యుడు. తప్పకుండా నీకు దృష్టివస్తుంది" శేఖర్ ఆనందాతిశయంతో శాంతకు విన్నవించుకున్నాడు.

శాంత పరధ్యానంలో పడిపోయింది. ఒప్పక తప్పలేదు. ఆపరేషన్ అయ్యాక శాంతకళ్లను కట్టుగుడలు

అలంకరించాయి. దృష్టిలేని నేత్రాలకు కారాగారమై పోయాయి బాండేజ్‌గుడ్డలు. ఇంకొక్క వారంరోజులు ఓపికపడితే చాలు చూపువస్తుంది. ఆయనకు నమ్మకం వుంది తనకు వుందని అనటంలో అపోహ లేదుకూడా.

పద్మ చెప్పిన మాటలు శాంత హృదయంలో శూలంలా కెలికివేస్తున్నాయి. చేస్తున్నది తప్పని తెలిసినా శాంత కట్టు ఊడదీసుకుంది. కళ్లు చీకట్లలో ఊగుతున్నయ్. మొగ్గుకిరణం ఒకటి కండ్లలో నృత్యంచేస్తుంది. దాన్ని ఆధార చేసికుంది. ఆతృత పెల్లుబుకుతుండగా శేఖర్ ట్రంక్‌తెరచి పైనేఉన్న చిత్రాన్నితీసి వెలుగును దృష్టించింది. మూర్ఛపోయినంత పనైంది. అది శాంత తనచిత్రమే పోతుందని కలలోకూడా ఊహించలేదు. నిలువుటద్దంలో ఒకసారి పరీక్షగా తనరూపాన్ని అవలోకించి తన చిత్రాన్ని సరిచూసుకుంది. ఆయన అన్ని సరిగ్గావేశారు. అయితే కనుపాపలు వేయకుండా రెప్పలు ఖాళీగా వుంచారు. బహుశా.... తను కళ్లుతెరచాక వేద్దామనుకున్నారేమో? ఎంతో అపోహపడింది? మరి పద్మ అలాచెప్పిందే; పద్మలో ఏదో అసూయ ఆవరించి వుంటుంది? వారి అనురాగం తనుపొందినందుకా?

తడబడే చేతుల్తో బయట చప్పుడు అవడంతో. దూదిమీద తెల్లగుడ్డవేసికుని బిగించింది.
శేఖర్ అడుగులు గుమ్మానికి దగ్గరవుతున్నకొద్దీ శాంత హృదయం వేగంగా కొట్టుకుంటూంది.

"ఇదేమిటి శాంతా!.... డాక్టరు కట్టు ఊడదీయ వద్దని చెప్పలా? ఇలా అయితే చూపువస్తుందా?" అందోళనను వ్యక్తంచేశాడు శేఖర్.

"క్షమించండి. ఇన్నాళ్లూ చీకటిలో బ్రతకటంచేత ఆతృత నాలో ఎక్కువై, కట్టు ఊడదీయకలిగాను. కాని కళ్లుతెరవలేదు. ఆజ్యోతి పూర్ణత మయ్యే వఱకూ, "కనువిప్పులో మబ్బుతెరలేగా" వుండేది. ఐనా, నాకు దృష్టి పొందాలనే ఆశ ఏమాత్రమూలేదు. ప్రపంచాన్ని దాని మాయలనూ రెండుకళ్లతో చూస్తూ కృశించడంకంటే ఇలా కబోదిలా మీ అనురాగాన్ని నిరంతరమూ అనుభవించే జీవితాన్నే, నాడు భగవంతుడు ప్రసాదించాలని వేనోళ్ల స్తుతిస్తున్నాను. "గాద్గదికంగా శాంత చెప్పుకుపోతోంది. ఆమెమనసు ఎంతోతేలికగా వుంది.

"లేదు శాంతా! నాదేవతకు తప్పకుండా చూపువస్తుంది. ప్రపంచాన్ని అందులో వుండే కుళ్లను చూస్తూకూడా దాన్ని అంటకుండా నడచుకోవడంలో, ఎంతో ధన్యతవుంది శాంతా?" ఆమెను దగ్గరకు తీసుకుంటూ ప్రేమతో ఆమెహస్తాన్ని స్పందించాడు శేఖర్.

"ఏది ఏమైనా దైవం నామనోనేత్రాలు తెరచి మిమ్మల్ని క్షుణ్ణంగా అర్థంచేసికునే శక్తి యిచ్చాడు. నాకంతేచాలు" అంటూ ఈజీచైర్‌లో మేను వాల్చింది శాంత.

ఆమె మనోగతంలో శేఖర్ శాంతచిత్రంలో మిగిలిపోయిన కళ్లను కుంచెతో తీర్చిదిద్దుచున్న దృశ్యం నాట్యంచేస్తూంది. సిగ్గుతో తలదించుకుని నిద్రాదేవిఒడిలో పడిపోయింది, శాంత

శ్రీ కృష్ణవిలాసము

శ్రీ మైనంపాటి వేంకటసుబ్రహ్మణ్యము

ఆమనివేళ నవ్యకుసుమావృత కుంజకుడుంగమండలా
రామ విలాసవైభవ విరాజిత మంటపికాంతరచ్చల
ద్దామ విలంబి డోల సుఖదానుభవమ్మున గోపికాసఖి
ప్రేమముఁ దీర్పఁగాఁ దలఁచి పిల్చిన వాని విలాసమెన్నదఱ.

పాపనిపైని మీపరుషవాక్కులు నాడఁగ నేమటంచు నా
గోపునితల్లి రోషపరిగుంఫితభాషితయైనఁ జూచి నీ
తాపము సైచలేనని వితాకునఁ గుందఁగ నూరదించి యా
గోపకులాంగనావళుల కోర్కెలుదీర్చిన గోపుఁడెవ్వడో. (సశేషం)

ఆంధ్ర మహిళా సభ

బర్కత్పుర, హైదరాబాదు, (ఆంధ్రప్రదేశ్)

హైదరాబాదు; 23 నవంబరు_ 1961

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, చేతిపనుల— వ్యాపారాల శాఖాపక్షమున నవంబరు 20 వ-తారీఖునుండి, 27వ—తారీఖువరకు "కుటీరపరిశ్రమలవారం" ఉత్సవాన్ని జరిపింది. హైదరాబాదు ప్రాంతీయ పరిశ్రమల తరిబీతుసంస్థ, పైవారోత్సవాలతోబాటు 23-11-1961 వ తారీఖున 'మహిళాదిన' ఉత్సవాన్నికూడ జరపాల్నని నిశ్చయించింది.

తదనుసారం, ప్రాంతీయ కుటీరపరిశ్రమల తరిబీతు సంస్థ 23—11—61 గురువారంనాడు, హైదరాబాదు లోని ఆంధ్రయువతీమండలి భవనంలో సమావేశం అయి "మహిళా దినోత్సవం" జయప్రదంగా జరిపింది. ఒకవస్తుప్రదర్శనంకూడా ఏర్పరచటమే కాకుండా, వివిధపరిశ్రమల కార్యవిధానాలను ప్రేక్షకులకు ప్రత్యక్షంగా చేసి చూపారు. అందులో విరామకాలాభ్యాస శిక్షణ పొందే మల్లేపల్లి విద్యార్థినులు, ముషీరాబాదు లోని గ్రామీణ పరిశ్రమల శిక్షణాలయం వారు, బీడీకార్మికులు శ్రద్ధాసక్తులతో పాల్గొన్నారు. ఆదినం సాయంకాలం జరిగిన సమావేశానికి, రాష్ట్ర సంఘ సంక్షేమ సమితికి అధ్యక్షురాలయిన శ్రీమతి— ఏ. శ్యామలదేవిగారు అగ్రాసనాధిపత్యం వహించారు. శ్రీమతి, సులోచన నరోత్తమరెడ్డిగారు బహుమతి ప్రదానం చేశారు, శ్రీమతి— యన్. కామేశ్వరి; డాక్టరు— కే, శకుంతలాదేవి, డాక్టరు ఆర్. వి. రావు; శ్రీబాలకోటయ్య; శ్రీమతి— భాకరలీ ఖాన్; శ్రీ కోదండరావు మున్నగు సుప్రసిద్ధులు ఆసభకు విజయం చేశారు.

ఆంధ్రబాలానందసంఘ శిశువులు "బొమ్మలపెండ్లి" అనే నృత్యనాటకాన్ని ప్రదర్శించారు. సంగ్రహీకృత పాఠ్యక్రమతరగతుల్లో చదివే ఆంధ్రమహిళాసభా విద్యార్థినులు బుర్రకథను ప్రదర్శించారు. ఆంధ్రయువతీ మండలి సభ్యురాండ్రు జంత్రవాద్యములు వాయించారు.

ఆంధ్రమహిళాసభ— వివిధ క్రీడలు పందాలు విద్యార్థినులకొఱకు సభాకార్యోద్యోగులకు ఏర్పరచారు. వాటిలో పిల్లలు పెద్దలు చాలమంది పాల్గొన్నారు. వారికందరికి సభవారు శ్రీమతి సులోచనా నరోత్తమరెడ్డిగారి ద్వారా బహుమతులు పంచిపెట్టారు.

సంస్థకు పర్యవేక్షకులయిన (Superintendent of the Institute) అయిన శ్రీ— జి. జి. ఎయిరేగారు సభాసందర్భంగా గడచిన మూడేండ్లు జరిగిన కార్యక్రమాన్ని గూర్చి సంగ్రహనివేదికను సభకు సమర్పించారు.

జాయింటు డైరెక్టరయిన డాక్టరు ఆర్, వి, రావు, స్వాగతోపన్యాసమిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లోని కుటీరపరిశ్రమల్లో తయారయ్యే వస్తువులు, మనభారతదేశంలోనే కాక పరదేశాల్లోకూడ ఎలా జనాన్ని ఆకర్షిస్తూవుందో— విస్పష్టం చేశారు. ఆయన ఇంకా పలురకాలయిన చేతిపనులనుగూర్చిన్ని, అవి తయారైన ప్రదేశాలనుగూర్చిన్ని వివరిస్తూ, యావద్భారత పరిశ్రమలసంఘం అధ్యక్షురాలైన శ్రీమతి కమలాదేవి ఛటోపాధ్యాయగారి సలహాలను అనుసరించి తాము ఆగృహపరిశ్రమలను అభివృద్ధికి తేవటానికి సమస్త ప్రయత్నాలు చేస్తున్నామనీ చెప్పారు. అంతేగాక, ఈపారిశ్రామిక కళావృత్తిని అవలంబించి పనిచేస్తూన్న వారి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి పొందాలి, అప్పుడే వారి పరిశ్రమలలో నూతనత్వం కలుగుతుంది. వారంగల్లులో తయారయ్యే జంబుఖానాలు, పడుకల పీట్లు విస్తారంగా వ్యాప్తిచెంది ఆర్థికబలం చేకూర్చేవి. నరసాపురంలోని జరీపనులుగల వస్త్రాలు ఎల్లప్పుడు పరదేశాలకు ఎగుమతి అవుతూ వున్నాయి. అవి చాలా విలువగలవి. పూర్వకాలంనుంచీ ఆంధ్రులచరిత్ర పరిశీలించి చూచామంటే, వారు ఇలాటి చేతిపనులు శ్రద్ధతోను ఉత్సాహంతోను చేస్తూ వస్తున్నారని ఋజువు అవుతోంది. ప్రకృతం మనం స్వతంత్రం పొందినతరువాత, కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వం ఈలాటి కుటీరపరిశ్రమలలో జీవితం గడిపేవారిని ప్రోత్సహిస్తూవున్నది. ప్రకృతం ఆంధ్రరాష్ట్రంలో తయారయ్యే వస్తువులలో నూటికి 60వఱకు రాష్ట్రంలోనే విక్రయమవుతున్నాయి.

శ్రీమతి భాకరలీఖాన్‌గారు ఇలా ఉపన్యసించారు :— "ప్రత్యేకంగా ఈచేతిపనులు అబలాలోకానికి చాలా ఉపకారకమయింది. అట్టి పనులవల్ల వనితామణులు ఇండ్లలోని తమకుటుంబాలకు ఆర్థికంగా,

ఎక్కువతోడ్పడటానికి అవకాశం ఏర్పడుతుంది." డాక్టరు— కే. శకుంతలాదేవిగారుకూడ చేతిపనులను గూర్చి ఉపన్యసించారు. తరువాత ఇండస్ట్రీస్ కామెర్సు శాఖల అసిస్టెంటుడైరక్టరుగారగు శ్రీసుబ్రహ్మణ్యంగారు ఢిల్లీ వస్తుప్రదర్శనోత్సవాల్లోని, ఆంధ్రప్రదేశ్ వస్తుప్రదర్శనశాలనుగూర్చి సంగ్రహంగా చెబుతూ, ప్రత్యేకంగా కుటీరపరిశ్రమలనుగూర్చి మాట్లాడారు.

శ్రీమతి— ఏ. శ్యామలాదేవి, తమ అధ్యక్షోపన్యాసంలో— 'తయారయ్యే కుటీరపరిశ్రమలకు విశేషంగా ఖర్చులయ్యే మార్గాలుకూడా అత్యవసరం'— అని చెబుతూ, కొద్దికాలవ్యవధిలోనే ప్రాంతీయ పారిశ్రామిక శిక్షణాసంస్థవారు వస్తువులను నాజూకుగా తయారుచేసి ప్రదర్శించటాన్ని మెచ్చుకొన్నది. అంతేకాక, భారతీయమహిళలు ఈకుటీరపరిశ్రమలుకూడా మన జీవితంలో ఒకభాగం అని గుర్తించాల్నని ఉద్ఘాటించింది.

అటుపిమ్మట హైదరాబాదు— ఆంధ్రమహిళాసభకు సంయుక్త కార్యదర్శిని అయిన— శ్రీమతి కే. సుగుణమణిగారి సభాభివందనములతో ఆనాటి మహిళాదినోత్సవం జయపదంగా సమాప్తమయింది.

మహిళామణులకు ప్రాంతీయపు చేతిపనులలో తరిబీతునిచ్చే సంస్థ

ఏడవ యావద్భారతదేశ చేతిపనులవారం

వ్యాయామక్రీడలు: పంద్యాలు.

తరిబీతు పొందినవారు:—

ప్రత్యేక వ్యక్తులు: దారము, సూది పంద్యం

పేరు		విభాగము.
శ్రీమతి సర్దారుబేగం	మొదటి బహుమతి	బొమ్మలు చేయటం.
,, జి. ఆర్. పాళయం	రెండవ బహుమతి	బొమ్మలు ఛేయటం.
,, వసుమతి	మూడవ బహుమతి	రంగుల అద్దకం. ముద్రణం.

II బంగాళాదుంపల సేకరణ:

శ్రీమతి జమాలున్నీసా బేగం.	మొదటి బహుమతి.	బొమ్మల తయారీ. (గెల్చినవారు)
,, యం. యం. శ్యామలాదేవి.	రెండవ బహుమతి.	రంగుల అద్దకం, ముద్రణం.
,, డి. జీ. లిల్లికుట్టి.	మూడవ బహుమతి	అట్టకాగితాలపని. పుస్తకాల బైండింగు.

III నిమ్మకాయ: స్పూను పంద్యం

శ్రీమతి. జి. ఆర్. పాళయం	మొదటి బహుమతి	బొమ్మల తయారీ.
,, యం. యం శ్యామలాదేవి	రెండవ బహుమతి	రంగులు వేయటం ముద్రణం

(సమిష్టిగా)

VI రింగుటెన్నిస్:

శ్రీమతి. అనసూయ.	గెలుపు పొందినవారు,	తోళ్లపని.
,, యం. యం. శ్యామలా దేవి	గెలుపు పొందినవారు	అద్దకం. రంగుల ముద్రణం.
,, టి. జె. రోసమ్మ		అట్టకాగితాలపని. పుస్తకాల బైండింగు.
,, ఇ. పద్మినీ		రంగుల అద్దకం. ముద్రణం.

ఉద్యోగివర్గానికి చేరినవారు :

I	బాల్ బ్యాడ్మింటన్, (డబుల్సు).	శ్రీ టి. ప్రసాదరావు. శ్రీ జి. శ్రీనివాస రావు,	గెల్చినవారు గెల్చినవారు
		శ్రీమతి. కే. సుగుణ మణి. శ్రీ. యస్. యతి రామానుజయ్య.	
II	పటిల్ బాడ్మింటన్, డబుల్సు.	శ్రీ బి, మైత్ర శ్రీమతి. జి.తిమ్మా బాయి,	గెల్చినవారు
		శ్రీమతి లీలాగౌరీ బాజి. శ్రీ జి. జి. ఎయిరే.	
III	బొమ్మల కొలువు	నిర్మాణం: శ్రీమతి. కే. ఇందిరాబాయి, అలంకారం, దిద్దుతీర్పులు, శ్రీమతి కే. సుందరమ్మ.	
IV	నాలుగవ తరగతి	యం. సి. పంకర్	మొదటి బహుమానం.
	చిన్నవారు:	మహమ్మద్. యూసప్ ఉద్దీన్	రెండవ బహుమానం.
	పరుగుపందెం:	నరసింహులు	మూడవ బహుమానం.

I బుర్రకథ :—

1. శ్రీమతి. దుర్గ;
2. శ్రీమతి— కే. కోటీశ్వరమ్మ
3. శ్రీమతి మాలతి.

చేతిపనుల పోటీలు

బుధవారము 22 నవంబరు 61 — కాలము: మధ్యాహ్నము మీద 1గంటనుండి, సాయంకాలం 5గంటలవరకు.

పోటీవిషయం :—చేతితో పూలు, జిగణాలు కుట్టటం పరిశీలించు నిర్ణాయకులు :—

1. శ్రీమతి. యం. వై. నాయుడు. అసిసెంటు మేనేజరు, ఇండస్ట్రీసు, కామెర్సు శాఖలు, ఆంధ్రప్రదేశ్.
2. శ్రీమతి— జార్జి; ఆంధ్రయువతీ మండలి, సలహాదారు.
3. శ్రీమతి యస్. యం. ప్రభు, విరామకాలాల్లోని బాలికాపాఠశాల బోధకురాలు, మల్లేపల్లి.

పోటీదార్ల పేర్లు:—

వ. సం.		వ్యక్తిగతమయిన	బహుమానం.	విభాగము.
1.	శ్రీమతి.	యస్. వైచాల్కర్,	మొదటి బహుమతి	వెదురు పేము పనులు.
2.	,,	జమాలున్నిసాబేగం.	రెండవ బహుమతి	బొమ్మల తయారీ. (మైత్తని కొయ్యావస్తువులతో)
3.	,,	శారద	మూడవ బహుమతి	H.S.C. (సంగ్రహాపాఠ్య ప్రణాళిక)
4.	,,	జి. యన్. సుభద్రాబాయి,	ప్రోత్సాహకరంగా	మెత్తని కొయ్యబొమ్మల తయారీ.

1. శ్రీమతి యం. వై. నాయుడు.
2. ,, జార్జి.
3. ...

దసరా విరాళములు

భవననిర్మాణంకొరకు వసూలైన మొత్తములు

ఆంధ్రమహిళాసభ, హైదరాబాదుశాఖవారు, దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి పండుగలు జరుపుకొన్నారు. దసరాసందర్భములో బొమ్మలకొలువు కూడా పెట్టారు. వినోదకార్యక్రమములుకూడా జరిగింది. సభ్యులు, విద్యార్థినులు తదితరులూ విరాళములిచ్చిరి.

	రూ. నపై.
శ్రీ రామినేని బ్రహ్మయ్య	250–00
శ్రీ యస్. యతిరామానుజయ్య	50–00
శ్రీమతి ఎ. శ్యామలాదేవి	20–00

వస్తురూపముగా వచ్చిన విరాళములు.

M/s శంభులాల్. అండ్. కో,–60 శే. బియ్యము	39–00
M/s యఫ్. డి. ఖాన్ అండ్ కో, వస్త్రాలు	11–55
శ్రీయుతులు– జి. జి. ఎయరే; కె. లింగాధరరావు; బి. రామకృష్ణయ్య; M/s గోకుల్ కోఅపరేటివ్ మిల్కు సొసైటి: టి. అనంతబాబు; డాక్టరు శృతకీర్తి నాయుడు చెరి రూ.	120–00
M/s చిమన్‌లాల్ అండ్ కో; ఎమ్. రాఘవులు; డాక్టర్ కె. ఏ. రావు– వీరుచెరి 15 రూ.	45–00
శ్రీ సి. టి, శాస్త్రీ; టి. ప్రసాదరావు; శ్రీమతులు:– ఇ. సుందరమ్మ; షరీఫ్–ఉన్నిసా కాసిమ్; శ్రీ ఏ. గోపాలకృష్ణ; వి. రంగనాథం; శ్రీమతి జి. తిమ్మాబాయి; శ్రీయుతులు బి. రుక్మాజీవర్మ; శ్రీమతి వెంకటేశ్వరన్; ఇ. గోపాలం; మంగాదేవి; వీరు చెరి 10 రూ.	110–00
	645–55

	రూ. నపై.
	645–55
శ్రీమతి కె. ఇందిరాబాయి; జి. యస్. రావు; బి. మైత్రా; కె. సత్యమూర్తి; సి. హచ్. అనంతరావు; శ్రీమతులు వై. లలిత; డి. శారదాదేవి; పి. విమల; జి. ప్రభావతి; జి. శ్రీదేవి; బి.ఈశ్వర రెడ్డి; జి.సరోజా రెడ్డి; అదిలక్ష్మి; వి. రత్నమాంబ; కమలాదాసు; ఎస్. సూర్యకాంతం; శ్రీయుతులు టి. లక్ష్మయ్య; ఆర్. వి. రామారావు; ఎస్. నరసింహులు; యల్. యన్. బాబు; యస్. వెంకటేశ్వరరావు; శ్రీమతులు శేషు, శ్రీరంగం; ఎ. జయప్రదాదేవి; వేణుగోపాలరావు; వీరు. చెరి 5 రూ.	120–00
శ్రీయుతులు వసంత; ఊర్మిల; వీరుచెరి 3 రూ.	6–00
శ్రీ కె. యస్. శాస్త్రి; పి. అంజనేయమ్మ; శ్రీదేవి; పి. సరస్వతమ్మ; కె. శకుంతల; పి. ఇందిర; లీలావతి; పి. జయలక్ష్మి; యస్. మహాలక్ష్మి; చెరి 2 రూ.	18–00
పారిశ్రామిక శాఖలో శిక్షణపొందుచున్న వారి విరాళములు రూ.	76–00
చేనేతలో శిక్షణపొందుచున్న వారి విరాళములు రూ.	13–00
సంక్షిప్త విద్యాశాఖలో శిక్షణపొందుచున్న వారి విరాళములు రూ.	25–00
ఒక శ్రేయోభిలాషి రూ.	7–50
మొత్తం రూ.	911–05

వీరందరికీ మాకృతజ్ఞత తెలియజేయుచున్నాము.

పాకకళ

శ్రీమతి కే. రాజేశ్వరీరాణి

మణుగు పువ్వులు.

బియ్యం— 1 శేరు. తగినంత ఉప్పు. ఇంగువ.
పెసలపప్పు— ½ శేరు. తెల్లనువ్వులు అర్ధపావు.
నిమ్మకాయంత వెన్న.

బియ్యం రాయిరప్పా లేక బాగుచేసి పెసలపప్పు శుభ్రపరిచి కలిపి మిషనుకివ్వాలి. ఆ మెత్తటిపిండిలో వెన్నవేసి బాగాకలిపి ఉప్పు, ఇంగువ తెల్లనువ్వులు గుచ్చెత్తి పూరీలపిండిలా కలుపుకొని మణుగుపువ్వుల గొట్టంలో నూనెలో అయినా, డాల్డాలో అయినా వేపించి గోధుమరంగొచ్చేసరికి తీసివేయాలి. ఇది చాలాసులువయిన పిండివంట. బిడ్డలున్నఇంట్లో ఆటి వస్తుంది. సెనగపిండికాదు, కాబట్టి కడుపునొప్పి వగైరాలు రావు, వెన్న దొరకనిపక్షంలో డాల్డా వేయవచ్చు. లేదా నెయ్యి వెయ్యవచ్చు. పిండిలో కలిపేందుకు, నువ్వులుమాత్రం తెల్లటివి శేరుకి అర్ధపావు వెయ్యాలి. అంతే. కరకరలాడుతూ ఈ చలికాలానికి ఏదో పుస్తకంపెట్టుకొని చదువుకొంటూ ఇవి తింటూంటే సులువుగా కాలక్షేపమవుతుంది. వంటికిన్నీ ఏమీచెయ్యదు.

గోధుమలడ్డు.

రెండుశేర్లగోధుమ తీసుకొని డాల్డాతోగాని, నెయ్యితోగాని వేయించాలి. మంచివాసన వస్తుంది. అప్పుడు దించి కాళాయితట్టలో ఆరపొయ్యాలి. ఎవళ్లకెంత ఇష్టమో, తీపి ఆకొలతని అనుసరించి, చక్కెరని మెత్తగా దంచుకోవాలి. సహం చక్కెర తేతపాకం పట్టి సహంపిండిలో కలపాలి. నెయ్యిలో జీడిపప్పు దోరగా వేయించి, ఏలకులపొడి పిండిలో గుచ్చెత్తి ఈ పాకంపోసి కావల్సినసైజులో వుండ కట్టుకోవాలి వేడిమీదే పాలు అద్దుకొని ఉండలు కట్టవచ్చు. ఈలడ్లు వంటికి బలమయినది. గోధుమపిండి గనుక ఏఇబ్బందీ లేదు.

జున్నుకోవా.

రెండుశేర్లపాలు విరగకొట్టి జున్నుని బాగా నీరోడ్చి ఒకళాయి గిన్నెలో వేసి తగినంత చక్కెర చేర్చి సన్నటిసెగలో వుంచాలి. అప్పుడప్పుడూ అడుగంటకుండా నెయ్యివేస్తూ, గరిటతో కలుపుతూ సేవుండాలి. అడుగంటిందంటే మాడువాసన వేస్తుంది. మైసూర్ పాక్ లాగు వస్తుంది అప్పుడు ఏలకులపొడి ఇష్టంవున్నవారు పచ్చకర్పూరం కూడా వేసి నెయ్యిరాసిన పళ్లెంలో దిమ్మరించుకోవాలి. కొద్దిగా ఆరినవెనుక బిళ్లలక్రింద కోసుకోవచ్చు. అతిమకుమారమైన పిండివంటిఇది. ఆ బిళ్లలమీద కోసివుంచుకొన్న జీడి; బాదం; అక్రోట్, పిస్తా ఏదైనా వేయవచ్చు, రంగువేసి కొబ్బరికూడా చల్లవచ్చు, సున్నితమైన ఈ పిండివంటని ప్లేట్లలో పెట్టి స్పూన్లని సరఫరాచేసి, అతిథులకి సర్వుచేస్తే అప్టుడేటుగా వుంటుంది.

మహిళా సంక్షేమ సంఘం

1. మహిళాసంక్షేమం:— 2,980 మహిళా సంక్షేమసంస్థలు, 1,44,64, 700 రూపాయలు కేంద్ర సంక్షేమసంఘంనుండి గ్రాంటులుగా పొందినవి. ఈ గ్రాంట్లవల్ల 4,87, 352 మంది వనితామణులకు ఉపకారం జరిగి, లాభంపొందినారు.

2. శరీరదౌర్బల్యంగల స్త్రీజనం:— వీరిసహాయార్థం 243 సంస్థలు 38,48, 600 రూపాయల గ్రాంటులు పొందినవి. ఈ గ్రాంట్లమూలంగా, 1,0,1671 అంగవైకల్యంగలవారు లాభం పొందినారు.

3. సాంఘిక ఆర్థిక కార్యక్రమాలు:— 199 మంది పరిశ్రమ బోధకులుగ శిక్షణపొందినారు. 775 మంది అబలలు లఘుపరిశ్రమలలో ఉద్యోగులుగ నియమింపబడినారు.

4. శిశుసంక్షేమం:— 2,977 ... లకు 158,57, 400 రూపాయలు గ్రాంటులుగా ఇవ్వబడింది. దీనివల్ల 4,03,607 మంది బిడ్డలకు లాభించింది.

5. గ్రామాభ్యుదయం:— 1960 సం॥ డిసెంబరు 31తో పూర్తి అయిన సంవత్సరంలో 40, 648 గ్రామాల్లోని 4,883 కేంద్రాలలో 744 సంక్షేమకార్యకలాపాలు ప్రారంభింపబడినాయి. దీనివలన 2,67,39,000 మంది లాభం పొందినారు. కేంద్రసంక్షేమసంఘం ఇందుకై 3,25,59,000 రూపాయలు గ్రాంటులు మంజూరుచేసినది. సంక్షేమాభ్యుదయకార్యాలకయి పట్టణప్రాంతాలలో అధికంగా స్థాపించబడిన మరొక 61 కేంద్రాల కార్యాలకు 1961 సం॥ ఫిబ్రవరి 28 వ-తేదివరకు జరగదగిన పనులకై 17,25,000 రూపాయలుకూడా గ్రాంటుగా ఇచ్చినది.

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

Statistics for the Month of November, 1961.

OUT-PATIENT REGISTER:—

	No. of Medical cases treated	562
	,, ,, Surgical ,, ,,	23
	,, ,, Ante-natal ,, ,,	172
	,, ,, Post-natal ,, ,,	72
	,, ,, Gyneac ,, ,,	105
	,, ,, E.E.N.T. ,, ,,	40
	,, ,, Dental ,, ,,	5
Total	,, ,, New Patients	979
,,	,, ,, Old ,,	1049
	Grand Total	2028

ADMISSION REGISTER:—

	No. of Patients admitted for Normal Deliveries	109
	,, ,, ,, ,, ,, Abnormal Forceps -9 Ext. Breech -1 M.R.P. -1	11
,, ,,	Gyneac Cases Treated	33
,, ,,	Ante-natal cases e False pains	22
,, ,,	Medical ,,	24
,, ,,	Post-Natal ,,	1
,, ,,	Babies admitted as Lodgers	122
	Grand Total	322

(True Copy)

(Sd.) Dr. K. R. AMBUJA,
Resident Medical Officer.

(Sd.) Dr. M. PAVANA BAI,
Medical Superintendent.

Smt. V. LAKSHMI PARVATHI
Secretary.

తెగినతాడు

శ్రీమతి ప్రభావతీ గంగాధర్

"భార్యా రూపవతీ శత్రుః" అన్నారు పెద్దలు! రమణ పెద్దగా అట్టహాసంచేస్తూ, విశ్వాన్ని తోసుకుంటూ కాంటిన్‌లోకి వచ్చాడు. కాఫీ తాగుతున్న కృష్ణమూర్తి పంచప్రాణాలు ఎగిరిపోయాయి. ఎవడినిగురించి రమణ ఆమాటఅనడం? తననుగురించిన వ్యంగ్యం కాదుకదా? అతని బుర్ర అప్పుడే తీవ్రంగా పనిచేయటం మొదలెట్టింది.

"ఏంరా కిట్టూ? కాదంటావా?" గాలిదుమారం నేరుగా కృష్ణమూర్తిమీదే విరుచుకపడింది.

"అబ్బ పోండిరా...నన్నుచంపక !" కృష్ణమూర్తి కసురుకున్నాడు.

"ఓరిబాబోయ్ ! మనవాడికి రసపిచ్చి రేగినట్లుందిరా! మనకెందుకులే విశ్వం, రారాపోదాం !" విశ్వం రమణులు దూరానికి వెళ్లేవరకూ చూస్తూ కూర్చున్నాడు కృష్ణమూర్తి.

విజయను వీళ్లుగాని చూచారేమిటి? లేకుంటే అతగాడు ఎందుకలా అంటాడు.? తనభార్య నిస్సందేహంగా అందగత్తే! విజయకూడా వీళ్లను చూచిందికాబోలు! చూచి నవ్వివుంటుందేమో! వాళ్లు లోపలికివెళ్లి విజయతో మాట్లాడారేమో! ఇంకా ఏమో! ఇంకాఏమో! కృష్ణమూర్తి మెదడు ఇక పనిచెయ్యటం మానేసింది ! ఇంటికేసి గబగబ అడుగులు వెయ్యటం మొదలెట్టాడు !

విజయ పెందరాళే పనిముగించుకుంది. చక్కగా ముస్తాబై హాల్లోకూర్చుంది ! కృష్ణమూర్తి రాగానే సినిమాకు వెళ్లాలనే ఊహ పెద్దదైపోతోంది ! ఎంతకూ భర్త వస్తేనా? ప్చ్ ! కాకున్నా అలా ఆలోచిస్తేఎలా? ఆఫీసుపని పూర్తికావాలా? బయల్దేరాలి. రావాలి ! మధ్యలో కాస్త విశ్రాంతిగా కబుర్లు చెప్పుకుంటుంటారు కాబోలు ! ఇంట్లో క్షణం ఓయుగంగా గడుపుతున్న భార్య గుర్తుకు రా లేదుకాబోలు! విజయకు అంతలోనె నవ్వొచ్చింది తనఆలోచనలకు ! ఆయనకుండేది రెండే రెండుకాళ్లుగాదూ? నడవద్దూ ? పోనీ, డాబామీదకు వెళ్లిచూస్తే కనిపిస్తారేమో !

విజయ గబగబ మేడమీదకు వెళ్లింది. కృష్ణమూర్తి గబగబ నడిచివస్తున్నాడు. ఒంటరిగ వుండలేదనే తన కోసమే అంతత్వరగా వస్తున్నాడు ! ఆమెముఖంమీద చిరునవ్వువెలిగింది. అదేసమయంలో కృష్ణమూర్తి కూడా ఆమెవేపు చూచాడు. అతను వాకిట్లోకి అడుగేసేసరికి, ఆమె తలుపుతీసింది నవ్వుతూ !

"మేడమీద నిల్చుని నవ్వటం దేనికి?"

కృష్ణమూర్తి కంఠస్వరం విని ఆమె నవ్వుకాస్తా ఎగిరిపోయింది.

"ఎవరికోసం ఆసిగ్గుమాలిననవ్వు....?" ఆమె జబ్బపట్టుకున్నాడు బలంగా ! సింహంపంజాలో లేడిపిల్లలా అయిపోయింది ! అందాకావున్న ఆనందం ఎలాఎగిరిపోయిందో? ఒక్కసారిగా ముఖం పాలిపోయింది!

"మీరు వస్తున్నారోలేదో చూద్దామని మేడమీదకు...."

"ఆరమణగాడు.... విశ్వం వస్తున్నారేమో చూద్దామని.... వెళ్లావు, అవునా?" బలంగా వూపిరివదిలేశాడు.

ఊహించుకున్న తియ్యటిదృశ్యానికీ, జరుగుతున్న రసాభాసానికీ ఎక్కడా సామ్యమేలేదు. విజయమనస్సు అల్లకల్లోలమైంది. కళ్లెంట నీళ్లు జలజలరాలాయి.

"ఈ దొంగవేడుపులకేంగానీ, మరెప్పుడేనా మేడమీద కనిపించావంటే ఒళ్లు చీరేస్తాను....!" సింహగర్జన ఒకటిచేసి పెరట్లోకి వెళ్లిపోయాడు స్నానానికి! మర్నాడు కిందనే కూర్చుంది విజయ! నిన్నటిఉత్సాహం ఈరోజామెలో లేదు. కృష్ణమూర్తి వచ్చాడు. "ఈరోజు మేడమీదకెళ్లలేదేం?" వ్యంగ్యమైనప్రశ్నతోబాటు, వెళ్ళిందేమోనన్న అనుమానంకూడా తొంగిచూచింది!

విజయ మాట్లడకుండా, ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో పోసింది!

"ఏం? కోపంవచ్చిందా విజయా?" ఆమాటామెకు ప్రియవచనంలా లేదు; పుక్కహాసం చేసింది.

"ఈవీధితలుపు అలా బార్లాగా తీసివుంచకు. విజయా! దోవనపోయే ప్రతివాడూ ఇంట్లోకే చూస్తాడు." తలుపు దభేలున వేసివెళ్లాడు కృష్ణమూర్తి! నివ్వెరపోయింది విజయ.

ఆదివారం మధ్యాహ్నం కృష్ణమూర్తి నిద్రపోతున్నాడు. టైం రెండున్నర కావొస్తోంది! "కృష్ణమూ

ర్తి! కృష్ణమూర్తి!" వీధితలుపుతీసి చూచింది విజయ. ఎవరో భర్త స్నేహితుడులా వుంది!

"కృష్ణమూర్తి వున్నాడాండి?" అతనడిగాడు.

"ఉన్నారు. నిద్రపోతున్నారు .." ఆమెమాట పూర్తికాకముందే కృష్ణమూర్తి లేచొచ్చాడు. భార్య వేపు ఒక్క అగ్నిబాణం విసిరి, అంతలోనే చిరునవ్వు పులిమేసుకున్నాడు. "ఓ.... నువట్రా పాండూ? ఏదో దోవదప్పి వచ్చావే? ఇదో విజయా! రెండుకప్పుల కాఫీ ఎట్రా!" గుక్కతిప్పుకోకుండా మాట్లాడుతున్నాడేకానీ, కృష్ణమూర్తి పంచప్రాణాలూ, తలుపు వెనకా, కిటికీమీదే వున్నాయి! విజయ అక్కడెక్కడేనా వుందేమోనని, మనస్సు పీకుతోంది!

"కాఫీ తయారయింది!" విజయ లోపల్నుంచి మెల్లిగా పిలిచింది.

"ఆ! ఆ! వస్తున్నానుండు.... కూర్చోరా, పాండూ" గాభరాగా లోపలికి వచ్చాడు కృష్ణమూర్తి. ఆమెచేతిలోనుంచి "ట్రే" తీసుకుంటూ అతను చూచినచూపుకు భస్మంకాకుండా వుండిపోయింది విజయ.

"పాండూ"ను పంపించి సరాసరి వంటింట్లోకే వచ్చాడు కృష్ణమూర్తి.

"కులుకుతూ నువ్వెళ్లి తలుపుతియ్యకుంటే నేనేం చచ్చానా? నన్ను లేపకూడదూ? నాకెలాగో వెంటనే మెలకువ వచ్చింది..."

...."లేకుంటే అమాంతం నేనతన్ని తీసుక లేచిపోయేదాన్నా?" విజయలో ఓర్పునశించింది.

"మాటకుమాట ఎదురుచెప్పటంకూడానా? అసలా ఆలోచన మనస్సులో వుందన్నమాట!" అతనిచెయ్యి ఆమెచెంపమీద ఎఱ్ఱరంగు వేసింది!

ఇక ఎప్పుడు చూచినా, ఆయింటికిటికీలన్ని మూసి వుంటాయి! తలుపు తీసేజాడే ఎవ్వరికీ తెలియదు! ఇంట్లో మనషులున్నారో లేరోనసే అనుమానం కూడా అప్పుడప్పుడూ కొందరికి వస్తూంటుంది! ఆ నాలుగుగోడలమధ్య విజయ సజీవసమాధి చెయ్యబడిన మనిషిలా వుంటోంది! ఆమెకు భర్తంటే తగనిభయం. అతనిప్రవర్తనంటే అసహ్యం! బ్రతుకంటే విరక్తి! ఈ మూడే ఆమెసన్నిహితులూ స్నేహితులూను! ఆమె ఒకబలిపశువయితే, అతను దానికోకాపరి!

కృష్ణమూర్తికి చాలావరకు హాయిగావుంది! ఆమె బయటికిరాదు? భార్య నెవ్వరూ చూడరు! ఆమె చెడుమార్గాలు పట్టటానికి అవకాశాలులేవు! పైగా తనో ఆదర్శమైన పురుషుడిగా సంఘంలో చెలామణి అవుతున్నాడుకూడా! భార్యకు బోలెడన్ని చీరెలూ నగలూ, పూలూ, పండ్లూ ఓహ్! ఒకటేమిటి.... ఏ మగవాడూ, ఏఆడదానికీ ఇవ్వలేనన్ని విలువైన వస్తువులు ఆమెకిస్తాడు! ఎవరేనా స్నేహితులు అడిగిందేతడవుగా 'ఆదర్శదాంపత్యం,' "స్త్రీలఅభ్యుదయం, శ్రేయస్సు!" "సంఘంలో స్త్రీకి సమాన హక్కుండాలి!" వగైరా పెద్దపెద్ద మాటలతో ఉపన్యాసాలివ్వగలడు! కానీ భార్యనుమాత్రం, పరుల కంట పడకుండా, నరులకంట పడకుండా, అనుక్షణమూ, లోలోపల నలిపివెయ్యగలడు. అనుమానంతో! కృష్ణమూర్తికదే సంతృప్తి! ఆదర్శాలు పెద్దలవరకే! ఆచరణలో అవి పెట్టడానికి మనసొప్పుకోదు! కాపురానికి రాకముందు, పార్టీలకూ, షికారుకూ, స్నేహితుల ఇండ్లకూ అంటూ అప్పుడప్పుడూ వెళ్లే విజయను బాగా "కంట్రోల్" చేసేసాడు కృష్ణమూర్తి! విజయ అస్తిపంజరంలా తయారయితే మాత్రం ఏం? బోలెడన్ని మందులూ, టానిక్కులూ కొనిస్తాడతను!

"పిన్నిగారూ! పిన్నిగారూ!" చిన్నగొంతు ముద్దుగా వినిపించింది. తలుపుతియ్యాలని వెళ్లి, చటుక్కున ఏదోస్ఫురించి, కిటికీతీసి "ఎవరూ?" అంది విజయ.

"నేనండీ ఎదురింటి అమ్మాయిని... కాస్త కాఫీపొడివుంటే ఇప్పించుక రమ్మంది మాఅమ్మ. రేపు తిరిగి ఇచ్చేస్తాము." ఆ అమ్మాయి గాలితో మాట్లాడినట్టుగా చెప్పింది.

విజయకు నవ్వొచ్చింది. "పాపా!" అంది తలుపు తీసి.

కాఫీపొడి పట్టుకెళ్తూ" మాఇంటికోసారి రాండి పిన్నిగారూ!" అందాపాప అరిందాలా మొహంపెట్టి.

గుండెల్లో కెలికినట్టయింది విజయకు.... "అల్లాగే నమ్మా! ఇదిగోపాపా! ఆవాకిటితలుపు దగ్గరకు లాక్కెళ్లమ్మా!" విజయ గబగబ వంటింటివేపు నడిచింది. అక్కడ చారు పొంగిపోతున్నాయి.

హాల్లోకి వచ్చింది. ఊపిరితిరగటంలేదు. జైలుకూ ఇంటికీ ఏమీ భేదంలేదు కాకుంటే జైల్లో పోలీసులు తలుపులేస్తారు. ఇంట్లో తను తీస్తుంది! కుడివేపున్న కిటికీ ధైర్యంచేసి తెరిచింది. అక్కడే పక్కింటివాళ్ల గొడ్లసావిడి! తనలాటివే, కాస్త భేదంగల గొడ్లే అక్కడ గాళ్లకు కట్టేసివున్నాయి. కిటికీకి చేరబడి చూస్తోంటా మె! ఎవరో జీతగాడులా వున్నాడు. ఏభై ఏళ్లుండొచ్చు. చేతిలో నారపట్టుకవచ్చాడు. చూస్తుండగానే స్తంభానికి పురిపెట్టి తాడు వేసేస్తున్నాడు. విజయకు ఆశ్చర్యంవేసింది. త్రాళ్లు ఇలా మనుషులు చేత్తో తయారుచేస్తారనేది ఆమె మొదటిసారిగా తెలుసుకుంది. కుతూహాలంగా చూస్తోంది! అతని వేళ్ల కదలిక యంత్రంలోనే సాగిపోయి, చక, చక తాడు పూర్తయి పోతోంది. అనిమిషస్త్రీలా ఆమె చూస్తోంది.

ఎదురింటిపాప తలుపు వేసుక వెళ్లింతర్వాత గొళ్లెం పెట్టడం విజయ మర్చిపోయింది. కృష్ణమూర్తి వచ్చి, పదినిమిషాలుగా ఆమెక్కాస్త దూరంలో నిల్చుని వున్న సంగతి ఆమె గ్రహించలేదు. తాడు పూర్తయింది. అతను వెళ్లిపోయాడు. ఆమె ఏదో తన్మయత్వంతో ఇటు తిరిగింది. భర్తను చూచి కొయ్యబారిపోయింది. "అలా నివ్వెరపోతావేం? వాడు వెళ్లాడుగా? వెంట నువ్వూ వెళ్లలేకపోయావ్? అంతగా చూడటానికి అంతబాగున్నాడేం? ఆముసలి పీనుగ?" గర్జిస్తూ చిందులుతొక్కుతున్నాడు కృష్ణమూర్తి.

"ఛీ! ఇంత కుత్సితమైన ఆలోచనా మీది?" ఆమె అసహ్యంతో మొహం తిప్పుకుంది.

అతనిచెయ్యి ఆమెశరీరంమీద ప్రళయతాండవం చేసింది.

మర్నాడు కృష్ణమూర్తి నిద్రలేచివచ్చేసరికి కింద తలుపులూ, కిటికీలూ అన్నీ తీసేవున్నాయి. ఉడికిపోయింది అతనిమనస్సు. ఇల్లంతా విజయకోసం వెదికాడు. దేవుడిగదిలో కిందపడివుంది విజయ. ఏమిటో భయమేసింది. దగ్గరకు వెళ్లిచూచాడు. ఆమెలో ప్రాణంలేదు. కొయ్యబారిపోయాడు అతను. విజయ చేతిలో ఏదో కవరుంది. గబుక్కున తీసిచూచాడు. చేతులు ఒణికిపోతున్నాయి!


"అగ్నిసాక్షిగా మిమ్మల్ని వివాహంచేసుకున్నాను. మీరే నాసర్వస్వమని భావించాను. బాహ్యంగా మీరెంత అందంగా వుంటారో, అంతరంగంలో అంత కుసంస్కారులని క్రమేణా తెలుసుకున్నాను. మన వివాహమయినకొత్తలో, మీఅభ్యుదయభావాలతో కూడిన ఆదర్శాలూ, మాటలూ విని చాలాఉత్తములని అపోహపడ్డాను. కాని ఆదర్శాలను ఇంతవ్యతిరేకంగా ఆచరిస్తారని, నేను ఊహించుకోనుకూడా లేదు! బయటికివస్తేనే, పరపురుషుడి కంటపడితేనే, స్త్రీ చెడిపోతుందనీ, ఆమె నోభై దీలా వుంచితే బాగుంటుందనే దివ్యజ్ఞానం మీకెలా అంకురించిందో నాకు తెలియదుగానీ, నిరపరాధురాలినైన నన్ను చిత్రహింస చేశేసారు. మీఆదరణా, అనురాగమూ పొందాలని ఎంతో ఉవ్విళ్లూరి, తియ్యటికలలు కన్ననాలో, మీ అనుమాన పిశాచంతో, మీప్రవర్తనతో, అంతరంగలో మీపట్ల అనురాగాన్ని, మాయంచేసి, దానిస్థానే, ఓ విధమైన అసహ్యాన్ని నింపారు. ఎలాగో ఇందాకా సహించాను. ఇక నాలో ఓర్పులేదు. జీవితాంతం నేనెంతగా మిమ్మల్ని ప్రేమించినా, మీఅనుమానం మాత్రం పోదు. చివరకు నిన్న ఆముసలిజీతగాడు.... ఛీ... ఎన్నాళ్లీ అర్థంలేని బ్రతుకు? శాశ్వతంగానే పోతున్నాను. భగవంతుడు, నాజీవితాన్ని మీకు బలిచేసిన తర్వాతేనా, మీకు మంచిఆలోచనలు ఇస్తారని ఆశిస్తున్నాను. ఇక నాకు బాధలేదు, మీకు బాధవుండదు ఇంతే!"

కృష్ణమూర్తి హృదయంలో కొరివిపెట్టినట్లుగా అయింది! నిజమే, కిటికీలు, తలుపులు వెయ్యలేదని ఇక ఆకాశాన్ని బాధపెట్టలేడుతను. మేడమీదకు పోయీ వెందుకుంటూ నిలదియ్యలేదు. వాళ్లవేపు, వీళ్లవేపూ చూచావంటూ కొట్టలేదు! తనరాక్షసత్వంతో ఓముగ్ధప్రాణాన్ని లోలోపల హింసించి, నిర్మలమైన ఓహృదయాన్ని పోగొట్టుకున్నాడు. తనింక అసమర్ధుడు. ఎందుకూ పనికిమాలినవాడు! అప్రయత్నంగా అతడు హాల్లోకి వచ్చాడు! కుడివేపున్నకిటికీ తెరిచేవుంది! అనుకోకుండా అతనిదృష్టి కిటికీదాటి అవతలికి వెళ్లింది! పురిపెట్టిన ముసలిజీతగాడు, పురినిసాగదీయాలని, శక్తంతా కూడగట్టుక తాడు గుంజకేసి లాగాడు! అది పుటుక్కునతెగి కింద మట్టిలో పడ్డాడు!

అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము

1893 నుంచి లక్షలాది ప్రజలు అమృతాంజనం వాడి, ఎంత అమోఘమైన శక్తి కలదో తెలుసుకుంటున్నారు. అమృతాంజనంలో వాడే ఔషధాలన్నీ అతి శీఘ్రంగా బాధను పశమింప చేయుటయేగాక చాలా హాయిని కూడా కలిగిస్తాయి. హాని కలిగించే పదార్థాలేమీ లేవు కూడా. దగ్గు, జలుబు మొదలైనవి కూడా శీఘ్రంగా ఉపశమిస్తవి. అమృతాంజనం దగ్గర ఉంచే మీ రెటువంటి బాధనైనా జయించవచ్చు.



అమృతాంజన్ లిమిటెడ్,
మద్రాసు-4
బొంబాయి-1.
కలకత్తా-7

శిశు సంక్షేమ కార్యక్రమాలు

హైదరాబాదులో 23-12-61న ఆంధ్రప్రదేశ ఆరోగ్యశాఖా మంత్రి శ్రీ పి. వి. జి. రాజుగారి అగ్రాసనాధిపత్యం క్రిందజరిగిన సమావేశంలో కేంద్ర సంఘ సంక్షేమసమితికి అధ్యక్షురాలయిన శ్రీమతిదుర్గాబాయి దేశముఖుగారు ఈక్రిందివిధంగా ఉపన్యసించారు:—

మూడవప్రణాళికా కాలంలో శిశుసంక్షేమ కార్యక్రమాలకై 3కోట్లరూపాయలు ప్రత్యేకంగా కేటాయించబడింది. ఇది సంఘసంక్షేమ కార్యాలకు మూడవప్రణాళికలో సూచింపబడ్డ 28కోట్లుకాక ప్రత్యేకంగా మంజూరు చేయబడిన మొత్తం. కేంద్ర సంక్షేమసమితి. మొదటి, రెండవ ప్రణాళిక కాలాల్లో, అనేకసంక్షేమ కార్యసంస్థలకు 7 కోట్లరూపాయలవరకు సహాయం చేయగలిగింది. అంతేకాక ప్రత్యేకంగా శిశుసంక్షేమాభివృద్ధి కార్యాలకు (దేశంమొత్తంమీద) వెచ్చపెట్టటానికి 3 కోట్లు అధనంగా మంజూరు చేసింది. అందులో 120 లక్షలు శిశుసంక్షేమ సంస్థలను అధికంగా నెలకొల్పటానికి, బాలసేవికలకు శిక్షణమివ్వటానికి ఉపయోగించేట్లు తీర్మానించుకొన్నది. ఈమొత్తం కేంద్ర సంక్షేమ సమితి గుండా ఆయాసంస్థలకు పంచిపెట్ట బడుతుంది. మరొక 150లక్షలు శిశుసంక్షేమాభివృద్ధిని సంపూర్ణంగా నిరూపించే సంస్థలకు విద్యామంత్రివర్గశాఖ మూలంగా ఇవ్వబడుతుంది.

పసిబిడ్డల విషయంలో ప్రత్యేక శ్రద్ధవహించే విషయంలో ఆంధ్రప్రదేశ సంక్షేమసంస్థలు ఎక్కువజాగ్రత్త వహించి పనిచేస్తున్నాయి. ప్రతిరాష్ట్రంకూడా బాలాభ్యుదయవిషయంలో చక్కగా శ్రమించి పనిచేస్తున్నట్టు నిరూపించాల్నంటే, 7లేక8వేలు అయినా ఖర్చుపెట్టి తీరాలి. ప్రతిరాష్ట్రంలోను బాలసేవికలను తరిబీతుచేసే శిక్షణకేంద్రాలను స్థాపించాల్నని కేంద్రసంక్షేమ సమితి తీర్మానించు కొన్నది. ఈఉద్దేశంతోనే సమితి ఇదివరకే ఢిల్లి, మద్రాసు, జయపూర్, చాండీఘర్లలో ఆలాటి శిక్షణ కేంద్రాలను స్థాపించింది. శిశుసంక్షేమమునకు సంబంధించిన అనేకవిషయాలలో శిక్షణ నిచ్చే సంస్థను ఏర్పరచాల్నని సంక్షేమసమితియొక్క ముఖ్యోద్దేశం.

భారతదేశం లోని శిశుసంక్షేమ కార్యకలాపాలకు ఐక్యజాతీయ శిశుసంక్షేమ సంఘం అన్నివిధముల తోడ్పడ గలదు. అందులకై భారత శిశుసంక్షేమ సంఘం వారు 15పథకాలను సిపార్సుచేసి యున్నారు. ఐక్యజాతీయ సంఘం సాంకేతిక నిపుణుల రూపంగాను, స్టైపండుల రూపంగాను, సాధనసంపదల రూపంగాను మనకు చాలవరకు సహాయ పడగలరు.

ప్రాథమిక విద్యాదశకు పూర్వపు శిశుసంక్షేమ స్థితి వ్యర్థంకాకుండేట్టు జాగ్రత్త పడాల్నని నిపుణులఅభిప్రాయం. ఆదశకు ముందు ఎలా శిశుసంక్షేమ విషయంలో కృషిచేయాలి అనే సందర్భానికి అనుగుణంగా 10సంవత్సరాలకు సరిపోయే కార్యక్రమపథకాల్ని తయారు చేయమని భారతప్రభుత్వం, కేంద్ర సంక్షేమ సమితులకు ఉత్తర్వుచేసింది. దానికయ్యే ఆర్థిక వ్యయాన్నికూడా సూచించమని కోరింది".

తరువాత శ్రీ పి. వి. జి. రాజుగారు ఆంధ్రప్రదేశంలో శిశుసంక్షేమ కార్యములు ఎలా జరుగుతున్నదో అదెట్లు ముందు ముందు అభివృద్ధి పొందేట్లు పనిచేయాల్నో— చక్కగా ఉపన్యసించారు. శిశుసంక్షేమ సంఘ గౌరవ కార్యదర్శి అయిన శ్రీ పి. యస్. ఆర్, ఆంజనేయులు గారి అభివందనాలతో సభ సమాప్తం అయింది.

('హిందూ' 23-10-61- సోమవారము)

చేనేత విభాగము: బర్కత్పుర ఆంధ్ర మహిళా సభ, హైదరాబాదు



వార్తావళి

పంజాబుసుబా సాధించటానికి ఆమరణాంత నిరసన వ్రతదీక్ష అవలంబిస్తానని ప్రతిజ్ఞచేసిన మాస్టరు తారా సింగు మధ్యనే విరశనవ్రతం చాలించినందుకు సిక్కుగురుద్వారాకు వచ్చే భక్తులపాదరక్షలు వారుభోజనంచేసే పాత్రలు శుభ్రంచేయాల్సని విధించారు. ఆతీర్మానం మేరకు న్యూఢిల్లీలోని సిక్కుల గురుద్వారాలో ఆకర్మ కాండను ఈ నెల డిసంబరు 4 తేదీని మాస్టరుతారాసింగు నిర్వర్తించాడు.

మద్రాసు:

1961-62 సంవత్సరానికి ప్రముఖవణిక్ శిఖామణులు, వస్తూత్పత్తిదారులలో శ్రేష్ఠులు అయిన శ్రీ పి. సూర్య నారాయణగారు మదరాసు షెరీఫుగా నియమింపబడ్డారు.

మదరాసునగర పరిపాలనసభ(Madras Municipal corporation)కు ఈపర్యాయం హరిజనసభ్యులలోనుండి 'మేయరు'గా ఒకరిని ఎన్నుకొనవలసి యుండగా, ద్రావిడమున్నేట్ర కళగమున (D. M .K)కు చెందిన శ్రీ 'జి. కుచేలర్'- అనునతఁడు మెజారిటీఓట్లతో. మేయరు పదవిని పొందినాడు. శ్రీ- 'యం. వేదాచలం' అనే అతడు డిప్టిమేయరు అయినాడు, మేయరు బేసిన్‌బ్రిడ్జి డివిజన్‌కును, డిప్టిమేయరు తండియార్పేట డివిజన్‌కును నగరపరిపాలనసభాసభ్యులు.

న్యూఢిల్లీ:-

భారతదేశంలో 9 దినాలుఉండి యిక్కడి విశేషాలు గ్రహించటానికి సోవియట్ కాస్‌మోనాట్ (Soviet cosmonaut) శ్రీ యూరీ గారిన్ తనభార్యతోఁగూడ- 29-11-61 నాడు న్యూఢిల్లీకి వచ్చాడు. విమానాశ్రయం వద్ద మహోత్సాహంతో చేరిన ప్రజాసమూహం అతడికి సుస్వాగతం ఇచ్చింది.

న్యాయశాఖామంత్రి అయిన శ్రీ- ఏ. కే. సేన్ కలనల్ భట్టాచార్య విషయమై లోక్‌సభలో ఇలా చెప్పేడు;- సైన్యాధికారి అయిన కల్నల్‌భట్టాచార్యగారి శిక్షాసందర్భంలో ప్రకృతం పాకిస్థాను ఆపాదించిన అన్యాయాన్ని ప్రభుత్వం గమనించకపోలేదు. ఆవిషయం చక్కబడేంతవరకు ప్రభుత్వం తనప్రయత్నాలనుండి ఏ మాత్రం విరమించదు. పయిగా, ఆసైన్యాధికారిమీద అకస్మాత్తుగా పడి బలప్రయోగంతో పాకిస్థానీయులు భారత సరిహద్దుప్రాంతంనుండి తీసికొనివెళ్లటం, ఆదేశమందలి న్యాయానికి అనుగుణ్యమేమో!

ఈమధ్యను అర్జెంటినా అధ్యక్షుడు డా॥ ఫ్రెండిజి, ఢిల్లీకివచ్చి ప్రపంచపరిస్థితులనుగూర్చి, మనప్రధాని శ్రీ నెహ్రూతో సంప్రతిస్తూ, అన్నిదేశాలు లోకంలో శాంతిని నెలకొల్పే సందర్భంలో అర్జెంటినా సంసిద్ధతను వెల్లడించాడు.

గౌ॥ మలయారాజు. యాంగ్‌డీ, పెర్టూయాన్ అగాంగ్- అయనసతీతిలకం రాణీ రాజా పర్మైసూరీ (పరమేశ్వరి) అగాంగ్- 8-12-61 తారీఖున ఉదయం ఢిల్లీకి వచ్చారు. ఆపరిసరాలను అన్నిటిని సందర్శించి 15-15-61న మధ్యాహ్నం. 2-10 గంటలకు మదరాసుకు వచ్చారు. వారికి స్వాగతమివ్వటానికి మీనంబాకం విమానప్రదేశానికి మంత్రులు, ప్రభుత్వానికి సంబంధించిన ఉన్నతోద్యోగులు. ప్రధానసైనికాధికారులు, ఆ యా దేశాల ప్రతినిధులు వెళ్లేరు. మద్రాసులో ఉన్న మలయా దేశవిద్యార్థులు, వారిజాతీయపు టుదుపులతో మలయా రాజదంపతులు సందర్శించటానికి హాజరయ్యారు. విమానంనుంచి దిగగానే, గవర్నరు బిష్ణురాంమేధి, ముఖ్యామాత్యుడు శ్రీనాడారు ఆరాజదంపతులను పుష్పమాలలతో అలంకరించారు.

సోవియట్ ప్రెసిడెంటు శ్రీ- యల్. ఐ. బ్రెజినేవ్, తనపరివారవర్గంతో 15-12-61 న ఢిల్లీకి విమానంలో రాగానే విమానాశ్రయస్థానం (పాలం) లో డా. యస్. రాధాకృష్ణన్ (ఉపాధ్యక్షుడు,) శ్రీపండితనెహ్రూ (ప్రధాని) స్వాగతమిచ్చారు. వారితోపాటు మంత్రివర్గం, తక్కిన ఉన్నతోద్యోగులు మున్నగువారుకూడా పాల్గొన్నారు. అతడిరాకకు గౌరవసూచకంగా 21 గుండ్లు పేల్చబడ్డాయి. విమానాశ్రయస్థానంలో సోవియట్ప్రెసిడెంటు, "రష్యా, భారతదేశాలు రెండూకూడా శాంతిని కోరేదేశాలు. అవి పరస్పరమైత్రితో అందుకై కృషిచేస్తున్నాయి. ఇక్కడి ప్రభుత్వాధికారులతోను తక్కిన వారితోను, ప్రజాజీవితాలతోను, పరిచయం కలిగించుకొని రెండు ఇరుగుపొరుగుదేశాల సామరస్యంతోటి, శాంతిని నెలకొల్పవలెనని నేను మనస్ఫూర్తిగా కోరుతున్నాను" అని చెప్పారు. శ్రీబ్రెజినేవ్ ప్రత్యేకంగా రాష్ట్రపతిభవనంలో శ్రీనెహ్రూను కలిసికొని సంభాషించారు.

'గోవా' విమోచనం

ఐక్యభారతసైన్యాలు 19-12-1961-వ తారీఖున ఉదయం గోవా ముఖ్యనగరం అయిన పంజింలో ప్రవేశించి

పరదేశ దాస్యబంధాల్లోనుంచి విడిపించి, దాన్ని మాతృదేశానికి ప్రశాంతంతో అంకితంచేసినది.

పోర్చుగీసువారి దారుణదురంతాలనుంచి దాన్ని తొలగించటానికి భారతసైన్యాలకు 26 ½ గంటలకాలం మాత్రమే పట్టింది. హిందూదేశంలోని గోవా స్వాధీనంకావటంతో, ఇంక వలసరాజ్యాలనే మాటే భారతసీమలో తుడుచుకుపోయింది, బుడతకీచు ప్రభుత్వ సామ్రాజ్యభవనంమీద, భారతసామ్రాజ్య త్రివర్ణపతాక రెపరెపలాడింది.

వెంటనే గోవాప్రభుత్వానికి మిలటెరీ గవర్నరుగ నియమింపబడిన- మేజర్ జనరల్- కే. పి. కాండెత్- తన అధికారాన్ని స్వీకరించారు. అతనికి ప్రత్యేక సలహాదారుగా శ్రీ- జి. కే. హాండూగారిని భారతప్రభుత్వం నియమించింది.

తాము 400 సం॥ లకు వెనుక మరల మాతృదేశంతో చేరగలిగినందుకు గోవాప్రజ మహోత్సాహం వెల్లడించింది.

(వచ్చే సంచికలో గోవాచరిత్ర)

గ్రంథ సమీక్ష

వ్యాసవాణి: మూడవభాగము: కర్త; శ్రీజాస్తి వేంకటనరసయ్యగారు; చిలకలూరిపేట; (గుంటూరు జిల్లా-) ప్రకాశకులు: శ్రీభారతీసమితి; పామర్రు. కృష్ణాజిల్లా.

'వ్యాసవాణి' ప్రచురణాల్లో వివిధవిషయాలను గూర్చి, శ్రీజాస్తి వేంకటనరసయ్యగారు వ్రాసిన వ్యాసాలు అమూల్యములు. ప్రత్యాంధ్రుఁడును చదువఁదగినవి. ముఖ్యంగా విద్యార్థుల విజ్ఞానాన్ని పలుముఖాల అభివృద్ధిపఱచేవి. గ్రంథకర్త ఇట్టి స్వరచనల మూలముననేగాక. ఇతరుల రచనల ప్రచురించుట చేతఁగూడ, తెలుఁగుపలుకుల తల్లికిఁ చేయువరివస్య అసమానము. ఇప్పటికి వ్యాసవాణీ భాగములు మూడయినవి. నాల్గవదానికి గూడ విషయ సంగ్రహణము జరిగినది .ముఖ్యముగ- (1) నవ్యాంధ్రనిర్మాత, (2) బ్రహ్మర్షి, (3) సాధూజీ, (4) గురుదేవుడు (5) విశ్వకవి— ఇట్టివారినిగూర్చి తెలిపిన విషయములెల్లరు చూడఁదగినవి.

శ్రీవేంకటనరసయ్యగారి నిష్కామకర్మ తెలుఁగు భాషామతల్లికి ఉత్తేజముంగలిగించి ఆంధ్రప్రాభవము నన్నిదిక్కులఁజాటునవి- గ్రంథకర్త నాలుగవ భాగమునుగూడఁ బ్రచురించి ఆంధ్రుల సన్నుతిపాత్రులు కాగలరని మావిశ్వాసము.

వర్మోపదేశము: కర్త: శ్రీచలసాని లక్ష్మీనారాయణవర్మ, బ్యాంకుపేట, కలవపాదులపోస్టు;


(వయా) ఇందుపల్లి, (కృష్ణజిల్లా) వెల రు 00-50. ఇది నూటెనిమిది కందపద్యాల శతకము; గ్రంథకర్త, ఆత్మావబోధకముగ- 'వర్మ' శబ్దమును మకుటముగ (వేమన, చౌడప్పలవలె) కల్పించుకొనుట ఎంతయు సముచితముగ తోచుచున్నది. కవిచౌడప్ప కందముల వలెనే, యిందలి కందములును- అందములు చిందు లలితములగు భావములు పండితపామరులకెల్ల సులభగ్రాహ్యములగునట్లు- రచియించిరి. ఇందలి నీతులు సర్వసామాన్యములే అయినను, వాని నావిష్కరించుటలో నవ్యత లేకపోలేదు. మచ్చున కొండురెండు పద్యములు.—

"గడ్డాలు పెంచినంతనె,
దొడ్డగుణము పెరుగఁబోదు, దురదే పెరుగున్
బిడ్డలు గొడ్డులు సతమున్
గడ్డంబును జూచి భీతిగాంచును వర్మా!"
"ఇల్లాలు వీఁపుఁజూచున్,
దల్లెప్పుడు పొట్టఁజూచుఁ, దనయుఁడు మఱియున్
బిల్లయు జేబులుచూచును,
సల్లాపములాడు హితుఁడు, సత్యము వర్మా!"
పప్పుండవలయు విందున,
నిప్పుండఁగవలయు నెవుడు నిలయములోనన్
జెప్పుండవలయుఁ గాలికి
గప్పకు నీరుండవలయుఁ గదరా వర్మా!"

లోకానుభవము మిక్కుటముగ గల శ్రీవర్మగారింకను ఇట్టి నైతికగ్రంథరాజముల సృష్టించి వాగ్దేవి నారాధింతురుగాక.

"సనిమారంగము, రూపవాణి, డిసంబరుసంచికలు, వేంకటేశ్వర శతకము మాకార్యాలయం చేరినవి,

—కౌసిక


మీటర్ల లోనికి మార్పు
10
20
పొడవు, వెడల్పుల కొలతకి మీటరు ఒక ప్రమాణముగా అక్టోబరు 1 వ తేదీనుంచి అమలులోనికి వచ్చింది. ఒక ఏడాదిలో గజము, అడుగు, అంగుళం ప్రమాణాలు చట్టి సమ్మతము కానివి అవుతాయి.
బట్టల తానులమీద అప్పుడే మీటర్ల గుర్తులు వేయబడినాయి. వీటి ధరలలో కూడా 'మీటరు ఇంత' అని వేయబడింది.
ఒక మీటరు అంటే ఒక గజము పైన 3½ అంగుళాలు
40
50
మెట్రిక్ కొలతల ప్రకారం కొనండి
భారత ప్రభుత్వముచే జారీ చేయబడినది

ఆంధ్ర మహిళా సభ

మైలాపూర్ - మద్రాసు

మహిళా విద్యాలయము	: హిందీ, కాశీవిశ్వవిద్యాలయపుఎడ్మిషన్, ఆంధ్రామెట్రిక్, ఇ. ఎస్. ఎల్. సి., పరీక్షలకు శిక్షణ.
పారిశ్రామిక విద్యాలయము	: కుట్టు, ఎంబ్రాయిడరీ, ఊలు అల్లికలు, నూలు వడకుట, చేనేత, అచ్చుకూర్పు, ముద్రణ, బైండింగ్ ఇత్యాది పరిశ్రమలలో గవర్నమెంటు పరీక్షలకు శిక్షణ, బీద విద్యార్థినులకు ఉచితము.
మహిళా మందిరము	: విద్యార్థినులకు వసతి గృహము.
ఆంధ్ర మహిళ	: స్త్రీలలో విద్యా వ్యాప్తికై స్త్రీలచే నడుపబడుచున్న సచిత్ర మాస పత్రిక
నర్సింగ్ హోమ్	: స్త్రీ శిశు సంరక్షణశాల, ప్రసూతిశాల, ఉచిత వైద్యశాల, కుటుంబ నియంత్రణశాఖ, దంత వైద్యశాల—అడయారులో నిర్మించబడినవి. భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖవారి విధానాన్ని అనుసరించి, సంక్షిప్త నర్స్ ఎయిడ్—మంత్రసాని పనులలో శిక్షణ యివ్వబడుచున్నది. ఫామిలీ ప్లానింగు వర్కర్సుకు శిక్షణ కూడ యివ్వబడుచున్నది.
ఆర్థోపెడిక్ సెంటర్	: వికలాంగులగు బాలబాలికలకు సంరక్షణ, విద్య యిచ్చే సంక్షేమ కేంద్రం.
ముద్రణాలయము	: విద్యార్థినులకు అచ్చుకూర్పు, బైండింగ్, ప్రూఫురీడింగు, మొదలైనవి ఉచితంగా నేర్పబడును. ప్రింటింగు జాబ్ వర్క్సు చేయబడును.
నాగేశ్వర శిశువిహార్	: పిల్లల విద్యావినోద కేంద్రం ప్రాథమిక పాఠశాల నడుపబడుచున్నది.
అర్బన్ వెల్ఫేరు ప్రాజెక్టు	: కపాలి తోట్టంలోను నారాయణస్వామి గార్డెన్‌లోను బీదలకు సంక్షేమ కార్యక్రమముల నిర్వహింపబడుతోంది.
వనితా బాలవిహార్	: స్త్రీలకు, పిల్లలకు, పార్కు, ఆటస్థలం
రీజియనల్ హాండీక్రాఫ్ట్సు యిన్స్టిట్యూట్	: ఆంధ్రమహిళాసభ, హైదరాబాదుబ్రాంచిచే నడుపబడుచున్న, చేతిపనుల శిక్షణాలయము.

ఆంధ్ర మహిళా సభ బర్కత్పుర, హైదరాబాదు

పై సభాయాజమాన్యంక్రింద ఈక్రిందిశాఖలు పనిచేస్తూ వున్నవి. (1) సంక్షిప్త విద్యాప్రణాళిక, (2) చేనేత శిక్షణ— ఉత్పత్తి కేంద్రము, (3) పౌర సంక్షేమ కార్యక్రమ పథకము, (Urban Welfare project) (4) వసతిగృహము, (Hostel)

ఆంధ్రమహిళ

★

ఆంధ్ర రాజధాని హైదరాబాదునుండి
'ఆంధ్ర మహిళ'ను ప్రచురించటకు ఏర్పాట్లు
చేస్తున్నాం. ఇకనుండి తమ చందాలను
కార్యదర్శి, ఆంధ్ర మహిళా సభ, బర్కత్‌పుర,
హైదరాబాదుకు పంపండి. సం॥చందా: రు 6 లు

★

ఆంధ్ర మహిళల యేకైక అభ్యుదయ మాస పత్రిక.

Printed at Andhra Mahila Press, 7/A, Rosary Church Road, Published and Owned by